ప్రజాశక్తి
శనివారం 10 ఫిబ్రవరి 2024 8 పేజీలు





గుంటూరు పల్నాడు

జిజిహెచ్‌లో తగ్గని రద్దీ

ఓపి కేంద్రాల్లో సిబ్బంది లేక రోగులకు తప్పని ఇబ్బందులు - సహాయకులతో వార్డులన్నీ కిటకిట



ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో రోగుల రద్దీ రోజురోజుకూ పెరుగుతోంది. ఇటీవల ఆస్పత్రి ప్రాంగణంలో 11 ఓపి రిజిస్ట్రేషన్ కౌంటర్లను ఏర్పాటు చేసినా తగినంత సిబ్బందిని నియమించకపోవడం వల్ల రోగులు ఎక్కువ సేపు పడిగాపులు కాయాల్సి వస్తోంది. సిబ్బంది నియామకంలో అలసత్వం ప్రదర్శిస్తున్న కాంట్రాక్టరుకు ఇటీవల సూపరింటెండెంట్ నోటీసులు జారీచేసినా స్పందన లేదు. ఆస్పత్రిలో పార్కింగ్ కూడా అస్తవ్యస్తంగా మారింది. ఆస్పత్రిలో రక్షణ చర్యలకు సెక్యూరిటీ విభాగం పర్యవేక్షణా కొరవడింది.

ఆసుపత్రి ఓపీకి ప్రతిరోజు రోగులు మూడు వెల నుంచి నాలుగు వేలమంది వస్తున్నారు. రోగులతో పాటు వారి సహాయకులు కూడా మరో నాలుగు వేలమందికి పైగా వస్తున్నారు. పరీక్షలకు వెళ్లడానికి ఒక్కడే వెళ్లలేని పరిస్థితిలో సహాయకులను తెచ్చుకోవడం అనివార్యంగా మారుతోంది. నడవలేని, అపస్మారస్థితిలో ఉన్న రోగులను ఒక వార్డునుంచి మరో వార్డుకు, పరీక్షలకు తీసుకువెళ్లాలన్నా నాల్గో తరగతి ఉద్యోగులు సహకరించని పరిస్థితుల్లో సహయకులు వెంట ఉండక తప్పని స్థితి నెలకొంది. ఒక రోగికి పరిస్థితిని బట్టి ఒకరు ఇద్దరు సహాయకులు రావాల్సిన పరిస్థితి నెలకొంది. రక్తపరీక్షలు, ఎక్స్‌రే, స్కానింగ్ తదితర అవసరాల కోసం ప్రతి రోగికి ఒక సహాయకుడు అనివార్యంగా ఉంటున్నారు. వార్డు బాయ్స్ వ్యవస్థ చాలా అధ్వానంగా ఉంది. అంబులెన్సు నుంచి వచ్చిన రోగిని కూడా వారి బంధువులే ఆస్పత్రి క్యాజువాలిటీకి, అక్కడ నుంచి వార్డులకు తీసుకువెళ్లక తప్పడం లేదు. వార్డుల్లో రోగితో పాటు సహాయకులు కూడా వైద్యుడి వద్దకు వెళ్తుండటం వల్ల క్యూలైన్లలో రద్దీ కన్పిస్తుంది.

ఉదయం 8 గంటలకే ఓపీ కేంద్రం వద్ద రోగులు ▶ 2లో

వార్త మెయిన్‌లో



కలెక్టరేట్‌కు ప్రదర్శనగా వెళ్తున్న నిరుద్యోగులు

మెగా డీఎస్సీ కోసం నిరుద్యోగుల ధర్నా

కొండవీడు ఫెస్ట్‌కు ఏర్పాట్లు సిద్ధం



ప్రజాశక్తి - యడ్లపాడు

కొండవీడులో శని, ఆదివారాల్లో నిర్వహించే ఫెస్ట్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పనులను పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పర్యవేక్షిస్తున్నారు. శుక్రవారం హెలికాప్టర్ రైడ్ ట్రయల్ రన్‌ను ప్రారంభించారు. కలెక్టర్ వెంట పల్నాడు జిల్లా అటవీ శాఖాధికారి రామచంద్రరావు, ఆర్ అండ్ బి ఎస్ఇ రాజానాయక్, ఆర్‌డిఒ పి.సరోజిని, స్థానిక అధికారులు ఉన్నారు.

పాఠశాలలు, కళాశాలల్లో ప్రవీణ్ ప్రకాష్ తనిఖీలు



గుంటూరులోని ప్రభుత్వ మహిళా ఒకేషనల్ కాలేజిలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ప్రవీణ్ ప్రకాష్

ప్రజాశక్తి-గుంటూరు

విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ శుక్రవారం గుంటూరు జిల్లాలో పర్యటించారు. పలు పాఠశాలలు, కళాశాలలు, టెట్ సెంటర్లను సందర్శించారు. తొలుత గడ్డిపాడులోని ప్రాథమిక పాఠశాలను, పెదకాకాని హైస్కూల్‌ను సందర్శించారు. అనంతరం గుంటూరులోని ప్రభుత్వ జూనియర్ కాలేజిని సందర్శించారు. తరగతుల నిర్వహణ, నాడు-నేడు పనులు పరిశీలించారు. సైన్స్ ల్యాబ్‌ను తనిఖీ చేశారు. అధ్యాపకులతో మాట్లాడుతూ ప్రభుత్వ విద్యార్థులకు ఉత్తమమైన విద్యను అందించటానికి రాష్ట్ర ప్రభుత్వం ఐబి సిలబస్‌ను ప్రవేశపెట్టబోతున్నట్లు చెప్పారు. ఆదివారం నుండి ప్రారంభం కానున్న ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలను పటిష్టంగా ▶ 2లో

నులిపురుగుల నివారణ కార్యక్రమం ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు



పిల్లలతో అల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న కలెక్టర్

జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని పురస్కరించుకొని పురస్కరించుకొని జిల్లాలో 4.72 లక్షల మందికి అల్బెండజోల్ మాత్రల పంపిణీ శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమం ఈనెల 16వ తేదీ వరకూ కొనసాగుతుంది. స్థానిక బ్రాడీపేటలోని శారదా నికేతన్ ఓరియంటల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కళాశాలలోని విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి స్వయంగా మాత్రలు మింగించారు. ఈ ▶ 2లో



పెదనందిపాడులో మాట్లాడుతున్న పాశం రామారావు



సత్తెనపల్లిలో మాట్లాడుతున్న గద్దె చలమయ్య

16న గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్, సత్తెనపల్లి టౌన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసన 16న జరిగే గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు, సీనియర్ నాయకులు గద్దె చలమయ్య పిలుపునిచ్చారు. పెదనందిపాడులోని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం కొత్త వెంకటశివరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రామారావు మాట్లాడగా, సత్తెనపల్లిలోని పుతుంబాక భవన్‌లో వివిధ పార్టీలు, ప్రజా సంఘాల సమావేశం జి.బాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించగా చలమయ్య మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పరచకుండా బిజెపి మోసం చేస్తోందని, వ్యవసాయం, పరిశ్రమలు, గనులు, విద్యుత్, అటవీ సంపదలో, ఎల్ఐసి వంటి తదితర సంస్థలన్నిటిని ఆదాని, అంబానీ తదితర కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్ట చూస్తోందని అన్నారు. కార్పొరేట్ కంపెనీల లాభాలకు ఆటంకంగా ఉన్న కార్మిక చట్టాలను రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందని తెలిపారు. రైతు ఉద్యమానికి తలవంచి వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేసినా మరొక రూపంలో వాటిని అమలు చేయాలని చూస్తోందని విమర్శించారు. విద్యుత్ చట్ట సవరణ బిల్లు పార్లమెంటు ముందు పెట్టారన్నారు. విభజన చట్టం హామీలను విస్మరించడం ద్వారా రాష్ట్రానికి మరింత ద్రోహం చేసిందన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిని వేధింపులకు చేస్తున్నారని, అక్రమ కేసులతో రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రాల హక్కులనూ కాలరాస్తున్నారని, ఈ నేపథ్యంలో ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.నళినీకాంత్, మండల కార్యదర్శి డి.రమేష్‌బాబు, నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, జె.రామారావు, సిహెచ్.యానాదులు, కె.వెంకటసుబ్బారావు, డి.శ్రీను, షేక్ సలీం, పి.భువనేశ్వరి పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో చలమయ్య మాట్లాడుతూ ఒకవైపు అరుగాలం శ్రామి స్తున్న రైతుల అప్పులను ముక్కుపిండి వసూళ్లు చేస్తున్న మోదీ, కార్పొరేట్ దిగ్గజాలు ఆదాని, అంబానిలకు రూ.16 లక్షల కోట్లు అప్పులు రద్దు చేశారని అన్నారు. బిజెపి పాలనలో లక్షన్నర మంది రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ శక్తులకు రైతుల భూములు ధారాదత్తం చేసేందుకు భూ హక్కుల చట్టం జీవో 27ను తీసుకొచ్చి అన్ని రాష్ట్రాలలో దీన్ని అమలు చేయాలంటూ కేంద్రం హుకుం జారి చేసిందన్నారు. మరల బీజేపీ అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్య సౌధం కూలిపోతుందన్నారు. అనంతరం కౌలురైతు సంఘ నాయకులు పి.మహేష్ కాంగ్రెస్‌పార్టి నాయకులు ఆర్.రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రాలపై కేంద్రం కర్రపెత్తనం చేస్తోందని, సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తిస్తోందని విమర్శించారు. పల్నాడు జిల్లా అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మల్లీశ్వరి మాట్లాడుతూ ప్రజల్లో బిజెపి మత చిచ్చు పెడుతోందని, ▶ 2లో

సినీ పరిశ్రమను అభివృద్ధి చేసేవారికే ఓట్లు

ప్రజాశక్తి-తెనాలిరూరల్: ఎపి సినిపరిశ్రమ అభివృద్ధి అంశంపై ఏ రాజకీయ పార్టీ తమ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరచకపోవడం శోచనీయమని మా-ఎపి వ్యవస్థాపకులు, సిని దర్శకుడు దిలీప్‌రాజా అన్నారు. స్థానిక మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ కార్యాలయంలో నటుడు మిలటరీ ప్రసాద్‌తో కలిసి శుక్రవారం ఆయర విలేకర్లతో మాట్లాడారు. సిని పరిశ్రమ అభివృద్ధికి కావాల్సిన వనరులను తమ మేనిఫెస్టోలో ఎవరైతే పొందుపరుస్తారో వారికే తమ ఓట్లు వేస్తామని అన్నారు. సిని పరిశ్రమ తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి కళాకారులు, సాంకేతిక నిపుణులు ఓటు వేయాలని కోరారు. తాము పొందుపరచిన అంశాలు అమలుపరచే విధంగా సిని పరిశ్రమకు సహకరించాలని రాజకీయ పార్టీలను కోరారు. ఎపిలో షూటింగులు నిర్వహించడానికి తగిన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రస్తుత నాయకులు దృష్టి పెట్టకపో వడం విచారకరమన్నారు. విజయవాడ, విశాఖలో స్టూడి యోలకు కేటాయించిన భూములు మాదిరిగా సినీసెట్లకు తగ్గట్టుగా భవనాలను నిర్మించాలని కోరారు. తద్వారా ప్రభుత్వానికి కొంత ఆర్థిక వనరులు సమకూరుతాయన్నారు.

దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్‌కు వెంకటేశ్వర్‌రెడ్డి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - గుంటూరు : నగరంలోని దేవాదాయ శాఖ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్‌గా ప్రమోషన్ పొందిన మహేశ్వరరెడ్డిని క్రెడాయ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి, ఆదిత్య బిల్డర్స్ అధినేత డి.వెంకటేశ్వరరెడ్డి, ప్రముఖ ఆడిటర్ టి.శ్రీహరిరెడ్డి శుక్రవారం కలిసి శుభాకాంఓలు తెలిపారు. ఈ సందర్భంగా డి.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ మహేశ్వర్‌రెడ్డి అసిస్టెంట్ కమిషనర్ నుంచి డిప్యూటీ కమిషనర్‌గా ప్రమోషన్ పొందడం మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, మంచి అధికారిగా గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.



బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్, డిజైన్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - ఎఎన్‌యు : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ కళాశాలలో బ్యాచిలర్ ఆఫ్ డిజైన్, బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్ కోర్సులలో 2024 -25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలు కల్పించనున్నట్లు అడ్మిషన్ల విభాగం డైరెక్టర్ డాక్టర్ జి.అనిత తెలిపారు. ఈ మేరకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కోర్సుల్లో చేరే అభ్యర్థులు ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఉండాలని లేదా 10 ప్లస్ 2 ప్రాథమిక అర్హతగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. సెల్ఫ్ సపోర్టు కేటగిరీలో ప్రవేశాలు కల్పించనున్నామని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు మార్చి 10వ తేదీలోగా ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని, పూర్తి వివరాలకు 0863 -2346171, 38, 9440258811, 9440258822 ఫోన్ నెంబర్లను లేదా ఎఎన్‌యు వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

బలమైన కోరికతో లక్ష్యాన్ని సాధించొచ్చు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ : బలమైన కోరికే లక్ష్య సాధనలో ముందుకు నడిపిస్తుందని లయన్ అన్నవరపు కోటిరెడ్డి అన్నారు. లైన్స్‌క్లబ్ ఆఫ్ విజయవాడ మహానగర్ ఆధ్వర్యంలో వడ్డేశ్వరంలోని జెడ్‌పి పాఠశాలలో హెచ్‌ఎం జి.సుబ్బారావు అధ్యక్షతన శుక్రవారం కెరియర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. కోటిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యసాధనలో ముందు ఉండాలంటే ముందు వారిపై వారికి నమ్మకం ఉండాలన్నారు. అబ్దుల్ కలాం జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. రెండుసార్లు మెట్రిక్యులేషన్ తప్పిన యార్లగడ్డ సుబ్బారావు ప్రఖ్యాత వైద్యునిగా పేరు ప్రఖ్యాతలు తెచ్చుకున్నారని, పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమని చెప్పారు. ఉపాధ్యాయులు కె.జోజప్ప, బుజ్జిబాబు, కె.వెంకటేశ్వరరావు, రామచంద్రరెడ్డి, ఎం.రమాదేవి, డి.వి.రమణమ్మ, అరుణ పాల్గొన్నారు.



ఐదుగురు అంతర్ జిల్లా చోరులు అరెస్టు

13 బైక్‌లు, 30 సెల్‌ఫోన్లు స్వాధీనం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ద్విచక్ర వాహనాలను చోరీ కేసుల్లో ఐదుగురుర్ని నల్లపాడు పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వారి వద్దనుండి రూ.24 లక్షల వాహనాలను, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వివరాలను జిల్లా ఎస్‌పి తుషార్ దూడి శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వెల్లడించారు. నల్లపాడు, మేడికొండూరు, పట్టాభిపురం, మంగళగిరి టౌన్, తాడేపల్లి, అమరావతి, ఇబ్రహీంపట్నం, ఒంగోలు టౌన్, సూర్యారావుపేట, విజయవాడ గవర్నర్‌పేట పోలీసు స్టేషన్ల పరిధిలోని ద్విచక్ర వాహనాలు, మొబైల్ షాపుల్లో చోరీ కేసులలో గోరంట్లకు చెందిన షేక్ ఆసీఫ్, పొన్నూరు మండలం ఎరుకుపాలేనికి చెందిన జాష్టి వెంకటసాయి, ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన మైదకూరి హసీబ్, పొన్నూరు



పట్టణం డివిసి కాలనీకి చెందిన దేవరకొండ రాజ్‌కుమార్, తాడికొండ మండలం రావెలకు చెందిన షేక్ మహమ్మద్‌ను అరెస్టు చేసినట్టు ఎస్‌పి చెప్పారు. 14 కేసుల్లో 13 ద్విచక్ర వాహనాలు, 30 సెల్ ఫోన్లు, ఐదు ఛార్జర్లు, 10 పవర్ బ్యాంకులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వివరించారు. కార్యక్రమంలో నల్లపాడు సిఐ సిహెచ్.రాంబాబు, ఎస్ఐ డి.అశోక్ పాల్గొన్నారు.

మిరియాల రాంబాబుకు పితృ వియోగం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ : వైసిపి కుంచనపల్లి గ్రామ అధ్యక్షులు మిరియాల రాంబాబు తండ్రి వెంకటేశ్వరరావు (బోస్) (72) శుక్రవారం అనారోగ్యంతో ఆయన నివాసంలో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. వెంకటేశ్వరరావు 90వ దశకంలో సిపిఐ కుంచనపల్లి గ్రామ కార్యదర్శిగా పనిచేశారు. రెండుసార్లు వార్డు మెంబరుగా గెలిచారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు వెంకటేశ్వరరావు భౌతికాయాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారిలో వైసిపి మంగళగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గంజి చిరంజీవి, వైసిపి ఎంటిఎంసి అధ్యక్షులు డి.వేమారెడ్డి, సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు, మండల కార్యదర్శి డి.వెంకటరెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు ఎ.నాగయ్య, టిడిపి మండల అధ్యక్షులు ఎ.సుబ్బారావు, సిపిఎం నాయకులు ఎ.రంగారావు, కె.వెంకటేశ్వరరావు, టిడిపి కుంచనపల్లి గ్రామ అధ్యక్షులు కె.కోటేశ్వరరావు, కార్యదర్శి బి.రమేష్, జనసేన గ్రామ అధ్యక్షులు ఎం.రాజా, వైసిపి సీనియర్ నాయకులు సిహెచ్.బాపిరెడ్డి, వైసిపి నాయకులు ఎం.వివేకానందరెడ్డి, పి.కృష్ణమూర్తి, జి.తాతారావు, బి.వేణుగోపాలస్వామిరెడ్డి, ఇ.డేవిడ్, కె.ప్రతాపరెడ్డి, డి.తిరుమలరెడ్డి, ఎన్.డేవిడ్, కె.శివనాగేశ్వరరావు ఉన్నారు.



వాహనం ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి - తెనాలి : గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో యువకుడు మృతి చెందాడు. రూరల్ పోలీసుల వివరాల ప్రకారం.. అంగలకుదురుకు చెందిన ఉప్పలపాటి నాగరాజు (33) గురువారం రాత్రి తెనాలి నుంచి ద్విచక్ర వాహనంపై అంగలకుదురు వెళుతుండగా అంగలకుదురు ఎస్బిఐ సమీపంలో గుర్తుతెనివాహనం ఢీకొంది. తీవ్ర గాయాలైన నాగరాజును స్థానికులు గమనించి ఆసుపత్రికి తరలించిగా అప్పటికే యువకుడు మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

జోరుగా అక్రమ మైనింగ్ వ్యాపారం

మాజీ ఎమ్మెల్యే డి.నరేంద్రకుమార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వైసిపి హయాంలో మైనింగ్ అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోందని మాజీ ఎమ్మెల్యే డి.నరేంద్రకుమార్ ఆరోపించారు. టిడిపి జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సిఎం జగన్ హయంలో మైనింగ్ ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం పెరగకపోగా ప్రైవేటు వ్యక్తుల ద్వారా వైసిపి నాయకులకు వచ్చే ఆదాయం గణనీయంగా పెరిగిందన్నారు. సిఎం జగన్ తన బినామీల ద్వారా అక్రమ వ్యాపారాన్ని ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. స్థిరమైన ఆదాయం ప్రభుత్వనికి ఇస్తామని చెప్పి వారిసొంత బిల్లులతో మైనింగ్ రవాణా చేయడం చూస్తే నయా దోపిడీ ఎలా ఉంటుందో తెలుసుకోవచ్చునన్నారు. ఇసుక, మట్టి, గ్రావెల్, ఇతర భూగర్భ వనరులను ఇష్టానుసారంగా దోపిడి చేస్తున్నారని అన్నారు. అనధికారికంగా మైనింగ్ టాక్స్ వసూళ్లపై తక్షణమే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

హాస్యంలోనూ సందేశం..

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని డాక్టర్ ఎస్పీ బాలసుబ్రమణ్యం థియేటర్ ఆర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో మూడ్రోజులుగా జరుగుతున్న రంగస్థలం నాటిక పోటీల్లో చివరి రోజైన శుక్రవారం ప్రదర్శించిన యాడనున్నాడో ఎక్కడున్నాడో అనే హాస్యభరిత సందేశాత్మక నాటిక అందరిని నవ్వించింది. స్వార్ధ ప్రయోజనాల కోసం సొంత మేనకోడలు ఆస్తిపై కన్నేసిన మేనమామ వివాహ వయసు దాటిన మేనకోడలికి పెళ్లి చేయకుండా ఆస్తిని అనుభవించే విధానాన్ని కళ్లకు కట్టినట్లు చూపారు. చిలకలూరిపేటకు చెందిన ఎమెచ్యూర్ సంస్థ ఈ నాటికను ప్రదర్శించింది. కళాకారులను వీసీ పి.రాజశేఖర్ సన్మానించారు. రిజిస్ట్రార్ బి.కరుణ, థియేటర్స్ విభాగం డీన్ డాక్టర్ జి.అనిత, డాక్టర్ భూషణ్, డాక్టర్ బి.నాగరాజు పాల్గొన్నారు.



తాడేపల్లి సమావేశంలో మాట్లాడుతున్న జొన్న శివశంకరరావు

16న గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

ఈ కుట్రలను తిప్పికొట్టాలని అన్నారు. సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి డి.విమల, సంఘాల నాయకులు జి.ఉమశ్రీ, ఎ.వీరబ్రహ్మం, ఎం.హరిపోతురాజు, శ్రీనివాస్, ఎం.నరసింహారావు, ఆర్.పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి

సిఐటియు, రైతు సంఘం ఆధ్వర్యంలో 16న జరిగే పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు వి.దుర్గారావు కోరారు. సిఐటియు, రైతు సంఘం, ఎఐటియుసి, ఐఎన్‌టియుసి, ఆటో యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. దుర్గారావు మాట్లాడుతూ ఇటీవల తీసుకొచ్చిన ట్రాన్స్‌పోర్టు రంగంలోని బిల్లు లారీ యజమానులకు, ఆటో డ్రైవర్లకు ఉరితాడు లాంటిదని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు బి.వెంకటేశ్వర్లు, కె.కరుణాకరరావు, పి.చిన్నారావు, కె.బాబూరావు, జె.శివశంకరరావు, ఎం.శ్రీనివాసరెడ్డి, బి.కొండారెడ్డి, టి.వెంకటయ్య, డి.సామ్యేలు, డి.వెంకటరెడ్డి, ఎం.పాములు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

గ్రామీణ బంద్, సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఎఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి చిన్నిసత్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక వేములపల్లి శ్రీకృష్ణ భవన్లోని కార్యాలయంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎ.ప్రభాకర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు ఎ.అరుణ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు కార్మిక వ్యతిరేక విధానాలు పరాకాష్టకు చేరాయని, సంపదను సృష్టిస్తున్న కార్మికులను మోడీ ప్రభుత్వం తీవ్ర నష్టాలకు గురి చేస్తోందని విమర్శించారు. బిజెపి ప్రభుత్వాన్ని ఓడించేందుకు ప్రజలు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు ఎం.హనుమంతరావు, జి.దుర్గారావు, జి.జానీ, వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.

పాఠశాలలు, కళాశాలల్లో ప్రవీణ్ ప్రకాష్ తనిఖీలు

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించాలని సూచించారు. నాడు-నేడు ద్వారా చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తి చేసి, వచ్చే ఏడాది కళాశాల ప్రారంభం నాటికి సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం కళాశాలలో పరీక్షలకు సిద్ధం అవుతున్న విద్యార్థినులతో మాట్లాడారు. అనంతరం ఆర్‌విఆర్ అండ్ జెసి, గుంటూరు శివారు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన టెట్ పరీక్షా కేంద్రాలను అధికారులతో కలిసి సందర్శించారు. పర్యటనలో పాఠశాల విద్య ఆర్‌జెడి బి.లింగేశ్వరరెడ్డి, ఇంటర్ ఆర్‌ఐఒ జి.కె.జుబేర్, డివిఇఒ జె.పద్మ, డిఇఒ పి.శైలజ, ప్రిన్సిపాల్ జి.సునీత, ఎన్.ఆనందబాబు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ కార్యక్రమం ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అల్బెండజోల్ మాత్రలు రెండు నుండి 19 ఏళ్ల వయస్సు గల పిల్లలు తప్పక వేసుకోవాలని, ఈ మాత్రలు ఫిబ్రవరి, ఆగస్టు మాసాల్లో ఏడాదికి రెండు సార్లు అందించి పిల్లల్లో రక్తహీనతను నిర్మూలించాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, జూనియర్ కళాశాలల్లో 4,72,534 మందికి విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు మింగించాల్సి ఉందని చెప్పారు. నులిపురుగులు చిన్న సమస్యగా కనిపిస్తుందని, కానీ చాలా ప్రమాదకరమని, చేతులు శుభ్రంగా వుంచుకోకపోవడం వల్ల నులిపురుగుల సమస్యలు వస్తున్నాయని అన్నారు. ఏడాది నుండి రెండేళ్లలోపు పిల్లలకు సగం మాత్రను నీటిలో కలిపి తాగించాలన్నారు. 2-19 ఏళ్లవారికి పూర్తి మాత్రను మధ్యాహ్నం భోజనం చేసిన అరగంట తరువాత చప్పరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మీ, ఆర్‌బిఎస్‌కె కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రావణబాబు, డిపిఐఎం రత్నమన్మోహన్, శ్రీశారదా నికేతన్ స్కూల్ ప్రిన్సిపల్ ఉషాకుమారి, కళాశాల ప్రిన్సిపల్ కోటిరత్నం, కరెస్పాండెంట్ జి.శ్రీనివాసరావు, ఎంఇఒ జ్యోతి, గుంటూరు పశ్చిమ మండల తహశీల్దార్ రవీంద్రరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిజిహెచ్‌లో తగ్గని రద్దీ

(మొదటి పేజీ తరువాయి)

తండోపతండాలుగా వస్తుందటంతో ఆ ప్రాంతమంతా కిక్కిరిసిపోతోంది. ఓపీ కౌంటర్ల వద్ద కేవలం ఐదారుగురు డేటా ఎంట్రీ ఆపరేటర్లు విధులలో ఉంటున్నారు. 11 రిజిస్ట్రేషన్ కౌంటర్‌లలో 11 మంది సిబ్బంది ఉండాల్సి ఉంది. ప్రింటర్లులు అందుబాటులో ఉంచాల్సి ఉండగా కాంట్రాక్టర్లు సిబ్బందిని, ప్రింటర్లను ఉంచడం లేదని చెబుతున్నారు. అరకొర సిబ్బందిని నియమించి తూతూ మంత్రంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఓపీ కేంద్రం తెరిచి ఉండాల్సి ఉండగా మధ్యాహ్నం తరువాత సిబ్బంది సంఖ్యను కూడా తగ్గిస్తున్నారు. పార్కింగ్ స్థలంలో వాహనదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నా వాహనాల రక్షణకు తగిన చర్యలు లేవు. తగినంత సెక్యూరిటీ సిబ్బందిని నియమించడం లేదు.

ముగ్గురు కాంట్రాక్టర్లకు నోటీసులు

సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్

ఆసుపత్రిలో విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న ముగ్గురు కాంట్రాక్టర్లకు నోటీసులిచ్చాం. రోగుల సౌకర్యం కోసం ఓపీ కేంద్రాల వద్ద రూ.20 లక్షలతో రేకుల షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశాం. రోగుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కొత్తగా 11 ఓపి కేంద్రాలను ప్రారంభించాం. రద్దీని నియంత్రించి వీలైనంత త్వరగా రోగులకు చికిత్స అందించి త్వరిత గతిన వారిని ఇంటికి పంపేందుకుచర్యలు తీసుకుంటున్నాం.

ప్రజాశక్తి
గుంటూరు, పల్నాడు 3
శనివారం 10 ఫిబ్రవరి 2024



మిర్చి నిల్వలు

		బ్యాగులు
మిర్చి దిగుమతి	:	1,10,077
మిర్చి ఎగుమతి	:	1,23,756
మిర్చి నిల్వ	:	79,736

మిర్చి ధరలు

	రూపాయలలో
334	10,000 - 21,500
నెం.5	11,000 - 17,000
273	13,500 - 16,000
341	11,500 - 22,100
4884	12,000 -16,200
సూపర్ 10	15,000- 17,000
	నాన్ ఎసి
తేజ	9,000 - 22,200
బడిగి	11,000 - 22,000
దేవనూరు డీలక్స్	13,000 - 20,000
తాలుకాయలు	5,000 - 12,000

నేరాల శాతం తగ్గించేందుకు కృషి

నేర సమీక్ష సమావేశంలో పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో నేరాల సంఖ్య తగ్గించేందుకు పోలీసులు కృషి చేయాలని ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి పోలీసు ఉన్నతాధి కారులను ఆదేశించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం జిల్లా లో జరిగిన నేరాలపై నేర సమీక్ష సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ కేసులను హేతుబద్ధంగా విశ్లేషించి తగ్గిం చాలని సూచించారు. సమీక్షా సమా వేశంలో స్పందన పిటిషన్లు, ఫోక్సో, గ్రేవ్, ప్రాపర్టీ, చీటింగ్, 174 సిఆర్.పిసి, మిస్సింగ్, గం జాయి, నాటుసారా కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. దిశా కాల్స్, 112, 100 ఎమర్జెన్సీ ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత ఇవ్వా లన్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న సమయాన్ని పరిగణన లోకి తీసుకొని నిర్లక్ష్యంగా స్పందించిన వారిపై శాఖా పరమైన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. రౌడీలు, సస్పెక్ట్ లు, పాత నేర స్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. జిల్లాలో తీసుకుం టున్న పటిష్ట చర్యలవలన గంజాయి అక్రమ రవాణాను నిరోధించ గలిగినట్లు చెప్పారు. ఆరోపణలు ఉన్న ప్రాంతాలలో కార్డన్ అండ్ సెర్చ్ లు, రైడ్ లు నిర్వ హించాలన్నారు. గతంలో నాటు సారా సంబంధిత కేసులలో బైండోవర్ చేసిన వ్యక్తులు తిరిగి పట్టు పడితే వార కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనం తరం పల్నాడు జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా నుండి బదిలీపై వెళుతున్న నరసరావుపేట డీఎస్పీ కె.వి మహేష్, సత్తెనపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ బి. ఆది నారాయణ, దిశా డిఎస్పి యు. రవిచంద్ర, ఏఆర్ డిఎస్పి బి. చిన్ని కృష్ణ , సిఐలుగా పనిచేసి ఉత్తమ ప్రతిభ కనబరిచి బదిలీ పై వెళ్లిన సిఐలు భక్తవత్సల రెడ్డి, సీతా రామయ్య, కృష్ణయ్య, షమీముల్లాను ఘనంగా సత్కరించారు. సమావేశంలో అదనపు ఎస్పి అడ్మిన్ ఆర్ రాఘవేంద్ర, ఎఆర్ అదనపు ఎస్పి డి. రామ చంద్ర రాజు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ వై. రవిశంకర్‌రెడ్డి


జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న ఎస్పీ

హెల్మెట్‌తో సురక్షిత ప్రయాణం

35 వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా హెల్మెట్ విని యోగం యొక్క ఆవశ్యకత వివరిస్తూ ఎస్పీ వై.రవి శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో నరసరావుపేట పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఎస్పీ వై.రవి శంకర్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ద్విచక్ర వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించాలని, ప్రమాద సమయంలో ప్రాణాపాయం నుండి బయట పడేందుకు 100 శాతం అవకాశం ఉంటుందని సూచించారు. 90 శాతం రోడ్డు ప్రమా దాలకు మైనర్ లు వాహనాలు నడపడం ద్వారా సంభవిస్తున్నాయని, వారికి వాహ నాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్య క్రమంలో అదనపు ఎస్పి అడ్మిన్ ఆర్ రాఘవేంద్ర, ఏఆర్ అదనపు ఎస్పి డి రామ చంద్రరాజు, డీఎస్పీలు కె.వి మహేష్, బి.ఆదినారాయణ, జి.సి. గురునాథ్ బాబు, పల్లపు రాజు, షేక్ షర్ఫా ద్దీన్, యు.రవి చంద్ర, ఏఆర్ డిఎస్పి బి చిన్నికష్ణ, డిస్ట్రిక్ట్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్ టి. కె. పరందామ రెడ్డి, మోటార్ వాహన ఇన్‌స్పెక్టర్ సత్యనారా యణ ప్రసాద్, అసిస్టెంట్ మోటార్ వెహి కల్ ఇన్‌స్పెక్టర్ శ్రావ్య పాల్గొన్నారు.

ఆలయ ఈఓగా సైదమ్మబాయి బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి -దుర్గి

మండల పరిధిలోని శ్రీ నిదానం పాడులోని శ్రీ నిదానంపాటి శ్రీ లక్ష్మీ అమ్మ వారి ఆలయ ముఖ్య కార్యని ర్వాహణాది కారిగా పి.సైదమ్మ బాయి ఉద్యోగ బాధ్య తలను శుక్రవారం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెను సత్కరించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

రూ.2.50 లక్షల సొమ్ము రికవరి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి: తెలంగాణలోని జోగులాంబ గద్వాల్ జిల్లా ఉండవల్లి గ్రామానికి చెందిన బోయ రాజు అలియాస్ బచ్చన్న ఈనెల 6వ తేదీన మిర్చి అమ్మడానికి గుంటూరు వచ్చారు. 61 బస్తాల మిర్చి విక్రయించగా వచ్చిన రూ.2.68 లక్షలు బ్యాగ్‌లో పెట్టుకుని గుంటూరు ఆర్‌టిసి బస్టాండ్‌లో కర్నూలు బస్సు ఎక్కుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు ఈ సొమ్మును అపహరించారు. ఈమేరకు బచ్చన్న పాత గుంటూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు విచారణ చేసి నిందితులను శుక్రవారం అరెస్టు చేశారు. విజయవాడకు చెందిన పాత నేరస్తుడు తోట వాసు కుమార్ ఈ చోరీ చేసినట్టు దర్యా ప్తులో నిర్ధారణ అయిందని జిల్లా ఎస్‌పి తుషార్ దూడి తెలిపారు. సిసి పుటేజి ద్వారా నిందితుడ్ని గుర్తించినట్టు మీడియాకు తెలిపారు. నిందితుడి నుంచిరూ.2.50 లక్షల సొమ్ము రికవరీచేసినట్టు ఎస్‌పి తెలిపారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - రొంపిచర్ల : పిడుగురాళ్లలోని 220 కెవి విద్యుత్ ఉపకేంద్రం మరమ్మత్తు పనుల నిమిత్తం మండలంలోని రొంపిచర్ల, మర్రిచెట్టు పాలెం, సుబ్బయ్య పాలెం, బుచ్చి పాపన్న పాలెంలలో శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నారు. ఈ విషయాన్ని మండల విద్యుత్ శాఖ అధి కారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా రైతులకు శనివారం రాత్రి 12 గంటల నుండి మర్నాడు ఉదయం 8 గంటల వరకు 3 ఫేస్ విద్యుత్ సరఫరా ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాలని వారు కోరారు.



ఓపీఎస్ అమలు చేసే వారికే ఓటు : యుటిఎఫ్

ప్రజాశక్తి - దుర్గి

సిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానం అమలు చేసే వారికే మా మద్దతు ఉంటుందని దుర్గి యుటిఎఫ్ నాయకులు పేర్కొన్నారు శుక్రవారం స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల దుర్గి నందు యుటిఎఫ్ నాయకులు ఓట్ ఫర్ ఓ పి ఎస్ పోస్టర్ ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించిన వారికి అలాగే ఎవరైతే సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేసే వారికే తమ ఓటు వేస్తామని తీర్మానం చేశారు. అనంతరం 'ఓట్ ఫర్ ఓపిఎస్' పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ దుర్గి మండల అధ్యక్షులు కె.దుర్గాప్రసాద్, యుటిఎఫ్ కోశాధి. కారి ఎం. రంగయ్య యుటిఎఫ్ సహాధ్య క్షులు ఆర్. అమర్ లింగేశ్వరరావు, యుటిఎఫ్ గౌరవాధ్యక్షులు ఎన్. రాధాకృష్ణ మూర్తి, యుటిఎఫ్ కాంప్లెక్స్ అధ్యక్షులు వై.సుబ్బారావు, యుటిఎఫ్ మండల కార్యదర్శి కె.మార్తమ్మ, ఐఇడి కమల పాల్గొన్నారు.



జివి దంపతులను కలిసిన గాయకుడు మనో

మనోను సత్కరించిన కౌన్సిలర్ లింగమూర్తి

ప్రజాశక్తి- వినుకొండ

ప్రముఖ గాయకుడు మనో, "స్టార్ మా' టివి సౌత్ ఇండియా హెడ్, మనో సోదరుడు బాబా వలి బృందం శ్రీశైలం శ్రీ మల్లికార్జున స్వామిని దర్శించుకుని హైదరాబాద్ వెళుతూ శుక్రవారం వినుకొండలో పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆయన సతీమణి లీలావతి దంపతులను వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా 32 వ వార్డు కౌన్సిలర్ వాసిరెడ్డి లింగమూర్తి, హనుమంతరావు, వెంకటరావు తదితరులు సింగర్ మనోను కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా జీవి ఆంజనేయులు మాట్లాడుతూ మనో, టివి బృందం వినుకొండకు రావడం సంతోషకరమన్నారు. మనో మాట్లాడుతూ జీవి ఆంజనేయులు దంపతులు శివశక్తి లీల ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సేవలను తెలుసుకున్నానని, రాజకీయాలకతీతంగా జీవి దంపతులు ప్రజలకు చేస్తున్న సేవలు అభినందనీయ మన్నారు. తమ వంతు సహాయ సహకారాలు ఉంటాయని చెప్పారు. వినుకొండ పట్టణంలో పలువురు ప్రముఖులు, అభి మానులు మనోను కలిసి సత్కరించారు. అనంతరం కౌన్సిలర్ వాసిరెడ్డి లింగమూర్తి ఇచ్చిన తేనేటి విందుకు మనో వెళ్లారు.

నేడు డయల్ యువర్ డిఎం కార్యక్రమం

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పిడుగురాళ్ల పట్టణంలో శనివారం 'డయల్ యువర్ డి ఎం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ ముక్తేశ్వరరావు ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. .ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు కార్యక్రమం ఈ కార్యక్రమం ఉంటుందని, ప్రజలు, ప్రయాణికులు తమ సమస్యలను సలహాలను తెలియజేయాల్సిందిగా కోరారు.

చాలీచాలని జీతాలతో చిరుద్యోగస్తులు

- **సిఐటియు జనరల్ బాడీ సమావేశంలో ఆంజనేయులు నాయక్**



సమావేశంలో మాట్లాడుతున్న ఆంజనేయులు నాయక్

ప్రజాశక్తి-చిలకలూరిపేట

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు, ఆశ వర్కర్లు, ఆర్.పి.లకు యానిమేట ర్లు, 10 వేలు జీతం తీసుకునే ప్రతి వారిక ప్రభుత్వ పథకాలు గాని, నవ రత్నాల పథకాలకు గాని అర్హులు కారని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అంటున్నారని, అటు వంటప్పుడు వీరికి హెచ్. ఆర్.(హౌస్ రెంట్ అలవెన్స్) ఎందుకివ్వడం లేదని పల్నాడు జిల్లా సిఐ టియు ప్రధాన కార్యదర్శి ఎస్. ఆంజనేయులు నాయక్ అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శుక్రవారం జరి గిన సిఐటియు జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సమావేశానికి ఎలక్ట్రిసిటీ యూనియన్ (సిఐటియు అనుబంధం) రాష్ట్ర అధ్యకులు జె.రాజశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆంజ నేయులు నాయక్ మాట్లాడుతూ చాలీ చాలని జీతాలతో కుటుంబాలను నెట్టు కొస్తున్న వీరు ప్రభుత్వ పథకాలకు ఎందుకు అర్హులు కారన్నారు. 'నవర త్నాలు'లో ఉన్న ఏ ఒక్క పథకమూ చిన్న ఉద్యోగులకు అమలు కావడం లేదన్నారు. మెప్మా సంస్థల్లో పని చేస్తున్న ఆర్‌పిలకు మూడేళ్ల కాలపరిమితి చట్టం 2019 తెచ్చారని, ప్రభుత్వ నాయకులు ఇలాంటి చిరుఉద్యోగులను ఇష్టముంటే ఉంచు తారని, .లేకుంటే తీసి వేస్తారని అన్నారు.

ఆర్‌పిలను భయపెట్టి వారి గుప్పెట్లో ఉంచు కునేందుకే ఈ కాల పరిమితి నిబంధన అని విమర్శించారు. ఆర్‌పిలను తీసివేసే అధికారి ఓ.బి లు తీర్మానం చేయాలని, ఆ పద్ధతి కూడా ప్రస్తుతం లేదన్నారు. ఉద్యోగ భద్రత ఇవ్వాలని, హెచ్ ఆర్ పాలసీ ఉన్నప్పుడే ఉద్యోగ భద్రత ఉంటుందన్నారు. కార్మిక వర్గ భవిష్యత్ లో అందర్నీ కలుపుకుని క్యా డర్ క్లాస్ లను సిఐటియు ఆధ్వర్యంలో చిలకలూరిపేటలో ఈ నెల 24,25 తేదీల్లో రెండు రోజులు నిర్వహించాల ని నిర్ణ యిచామని, ఈ కార్యక్రమాన్ని జయ ప్రదం చేయాలని కోరారు. కౌలు రైతుల సంఘం అధ్యక్షులు వై. రాధాకృష్ణ మాట్లాడు తూ ప్రభుత్వం మన ఐక్యతను విచ్ఛిన్నం చేసే ప్రయ త్నాలు చేస్తారని, ఐక్యతను కాపాడుకోవా లన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం లో కార్మికులు 44 చట్టాలను కాపాడు కుంటూ వస్తున్న అన్ని చట్టాలను మోదీ ప్రభుత్వం రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లను తెచ్చా రన్నారు. రాష్ట్ర ప్రభు త్వం కాలయాపన చేస మెగా డి.ఎస్.సి ని ఇవ్వలేక పోయా రన్నారు. ప్రతి సంవత్సరం 5 లక్షల మంది రిటైర్డు అయిపోతుంటే ఆ పోస్టులను భర్తీ చేయకుండా ఉన్న వారికే పని భారాన్ని పెంచుతున్నా రన్నారు. రైతుల పరిస్థితులు యింకా దారుణమన్నారు. మోడీ ప్రభుత్వం లో రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని రూ.6500 నుంచి రూ.8300కి పెంచటం అంటే రెట్టింపా అని ప్రశ్నించారు. ప్రస్తుతానికి ప్రతి రైతులు రెండున్నర లక్షల అప్పులు ఉన్నారన్నారు. కార్మిక, రైతులు అందరూ కలసి ఈ నెల 16న జరుగు భారీ ర్యాలీని జయప్రదం చేయాలన్నారు. సిఐటియు మండల కన్వీనర్ పేరుబోయిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సిఐటియు బలపడితే సంఘాలు బటపడినేట్లనని అన్నారు. సమావేశంలో సాతులూరి బాబు,రోశయ్య పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతో రక్తహీనత దూరం



విద్యార్థికి నులిపురుగుల టాబ్లెట్ వేస్తున్న డాక్టర్ బి.రవి , పక్కన ట్రైనీ కలెక్టర్, మున్సిపల్ డీఈ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నులి పురుగుల నివారణ ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సొంతం అవుతుందని 1 నుండి 19 ఏళ్ల బాల బాలికలు తప్పనిసరిగా ప్రభుత్వం సరఫరా చేస్తున్న నులి పురుగుల టాబ్లెట్ ను తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవి అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ సందర్భంగా పల్నాడు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు కళాశాలలకు ఆల్బెండజోల్ టాబ్లెట్లు సరఫరా చేసామని పేర్కొన్నారు. బరంపేట లోని శ్రీ రామకృష్ణ ఓరియంటల్ హైస్కూల్ లో ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ తో కలిసి పిల్లలకు ఆల్బెండజోల్ టాబ్లెట్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ టాబ్లెట్ నమిలి మింగి నులి పురుగుల నివారించుకోవాలని సూచించారు. నులిపురుగుల నివారణ దినోత్సవం యొక్క ఆవశ్యకత చేతులు శుభ్రం చేసుకోవడం వలన కలిగే ప్రయోజనాలు బాల బాలికలకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ ఆర్.బి.ఎస్.కె డాక్టర్ స్వర్ణ రాజరాజేశ్వరి, మెడికల్ ఆఫీసర్ పి. గాయత్రి, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పట్టణంలో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మునిసిపల్ ప్రాథమిక పాఠశాల యందు శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ వారి ఆదేశాల మేరకు పాఠశాల యందు విద్యార్థిని, విద్యార్థులకు నేషనల్ డీ వార్మింగ్ డే సందర్భంగా (నులిపురుగుల నివారణ) ఆల్ బెండజోల్ టాబ్లెట్స్ వేయించడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే సుధ ఒక ప్రకటనలో అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు విద్యార్థి దశలోనే వ్యక్తి గత పరిశుభ్రత అలవర్చుకోవా లన్నారు. తద్వారా వ్యాధి నిరోధకత పెంపొందించు కోవచ్చున్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం లో అన్ని రకాల పోషక విలువలు కలిగిన ఆహా రం అందిస్తున్నారని వారంలో ఐదు రోజుల పాటు ఉడక బెట్టిన కొడిగ్రు డ్డు అందిస్తున్నారన్నారు.

ఏ.యన్. యం. ధనలక్ష్మి మాట్లాడుతూ ఈ టాబ్లెట్స్ వినియోగం వల్ల కలిగే ఉప యోగాలు అనేకం ఉన్నాయన్నారు. చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం లో మెళకువలు తెలియజేశారు. విద్యార్థినీ విద్యార్థులు అందరూ ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసే వాటినీ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పాఠశాల ఉపాధ్యాయు లు పోటు శ్రీనివాసరావు ఏ.నీలిమ. టి.కుమారీ. ఆశ వర్కర్ యన్ రాజేశ్వరి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-పెదకూరపాడు

జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నులిపురుగుల నివారణకు మాత్రలు పంపిణీ చేశారు. శుక్రవారం పెదకూరపాడు మండలంలో 97 సెంటర్లలో ఒకటి నుంచి 19 వయసులోపు ఉన్న వారికి 8929 మంది కి అందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ తాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు వెలిగొండ రెడ్డి, సూపర్వైజర్ మున్ని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.





ఏవో కు వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు,ఆశాలు

ఆశాలపై ప్రభుత్వ నిర్బంధం తగదు

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా : ఆశా కార్యకర్తలు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని గురువారం తలపెట్టిన చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకోవడం పట్ల ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి డి శివకుమారి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదుట ఆశా కార్యకర్తలతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశా వర్కర్ల యూనియన్ సమావేశాన్ని అడ్డుకోవడంలో భాగంగా ప్రభుత్వం ఆశా కార్యకర్తలను గహనిర్బంధం అరెస్టులు చేయడాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో ఇప్పటికే అనేకమార్లు అధికారులకు వినతి పత్రాలు ఇచ్చామని అనేక రూపాలలో నిరసన కార్యక్రమాలు చేపట్టామని గుర్తు చేశారు. అనారోగ్యంతో ఉన్న ఆశా కార్యకర్తలను సైతం పోలీస్ స్టేషన్ తీసుకువెళ్లి కూర్చోబెట్టడం వాళ్లు రాకపోతే కుటుంబ సభ్యులు కూడా బెదిరించడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్బంధాలు ప్రయోగించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. గహనిర్బంధాలు అక్రమ అరెస్టులను నిలిపివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించడం చేతగాని రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకొని అరెస్టులు చేసి ఉద్యమాలను అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారం కోసం ఫిబ్రవరి 8 విజయవాడలో ధర్నా చేస్తామని ముందుగానే ప్రభుత్వానికి తెలియజేశామని ఈ నేపథ్యంలో చర్చలకు పిలిచి చర్చల అనంతరం యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మిని అరెస్టు చేసి ఏ స్టేషన్లో పెట్టింది కూడా తెలియజేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశాల సమస్యలు పరిష్కారం కోసం యూనియన్ ఆధ్వర్యంలో దశల వారీగా పోరాటాలు చేస్తూనే ఉంటామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో కార్యనిర్వహణ అధి కారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశాలు ఎం ధనలక్ష్మి, పి రాజ్యలక్ష్మి, పి హేమలత, షేక్ జరేన, ఆర్ కనక రత్నం, రోషన్ బి , యామిని, రమాదేవి, సత్యవతి, వెంకటరమణ, పద్మావతి, లక్ష్మీ ,దుర్గ తదితరులు పాల్గొన్నారు.


తుళ్లూరు


మేడికొండూరు

నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ ఆశాల నిరసన

ప్రజాశక్తి - తుళ్లూరు

తమ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం అవలంభిస్తున్న నిర్లక్ష్య వైఖరి పట్ల నిరసన తెలిపేందుకు చలో విజయవాడ కార్యక్రమం చేపట్టగా ప్రభుత్వం అక్రమ అరెస్టులు, నిర్బంధాలు, నోటీసులు ఇవ్వడం, అడుగడుగునా అడ్డంకులు కల్పించడాన్ని ఆశాలు తప్పుబట్టారు. స్థానిక గ్రంధాలయం సెంటరు వద్ద శుక్రవారం నిరసనకు దిగారు. సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.భాగ్యరాజు మాట్లాడుతూ సమస్యలు గురించి జగనన్నకు చెబుదాం.. అని విజయవాడకు వెళుతున్న ఆశా వర్కర్ల పట్ల ప్రభుత్వం, పోలీసులు దుర్మార్గంగా వ్యవహరించారని మండిపడ్డారు. నాయకులను అక్రమంగా అరెస్ట్ చేసి వారిని ఎక్కడ ఉంచారో కూడా తెలియనివ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశాలకు నిర్దిష్టంగా పనిగంటలు లేవని, ఆదివారం, పండుగ రోజుల్లో సైతం సెలవులు లేవని, వెట్టిచాకిరి చేసినా పని భద్రత లేదని ఆవేదన వెలిబుచ్చారు. ఆశా వర్కర్లకు ప్రభుత్వ పథకాలు కూడా అందడం లేదన్నారు. ఆశాలకు కనీస వేతనం చెల్లించాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, పని గంటలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. మల్లిక, రెబ్కా, లక్ష్మి, తులసి, రేణుక పాల్గొన్నారు.




తాడేపల్లి

ప్రజాశక్తి-తాడేపల్లి

ఆశాలు విధులు బహిష్కరించి ప్రభుత్వ ప్రాథమిక వైద్య కేంద్రం వద్ద నిరసన తెలిపారు. సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వి.దుర్గారావు మాట్లాడుతూ నిరసన తెలిపినా ప్రభుత్వం సహించలేకపోతోందని అన్నారు. కె.లక్ష్మి, రేణుక, కన్యాజ్యోతి, వినోదకుమారి, విజయలక్ష్మి, కరుణ, జయశ్రీలక్ష్మి, సుమతి, సుగుణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మేడికొండూరు

తమ సమస్యలను పరిష్కరించాలని డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు ఆశాలు వినతిపత్రం ఇచ్చారు. యూనియన్ మండల అధ్యక్షులు టి.ధనలక్ష్మి, ప్రజా సంఘాల మండల కన్వీనర్ బి.రామకృష్ణ మాట్లాడుతూ నిర్బంధాలపై పెట్టే శ్రద్ధ సమస్యల పరిష్కారంపై పెడితే బాగుంటుందన్నారు. నాయకులపై కేసులు ఎత్తేయాలన్నారు. కార్యక్రమంలో చెన్నమ్మ, వి.సరళ కుమారి, టి.అనూష, కె.రాణి, నాగేంద్రం, వెంకాయమ్మ, ఎలిసెమ్మ, సుజాత, శంషాద్, అరుణకుమారి, సంధ్య పాల్గొన్నారు.


ఆసరా చెక్కు అందజేస్తున్న బలసాని కిరణ్ కుమార్

డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కు అందజేత

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

బడుగుచ బలహీన వర్గాలవారికే కాకుండా అగ్రవర్ణాల్లోని పేదలకూ సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని వైసిపి ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ అన్నారు. శుక్రవారం పెదనందిపాడులో వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీని వైసిపి జిల్లా సాంస్కృతిక విభాగం కార్యదర్శి, సినీ దర్శకులు చెరుకూరి సాంబశివరావు అధ్యక్షతన నిర్వహించారు. కిరణ్‌కుమార్ మాట్లాడుతూ మండలంలోని 72 గ్రూపులకు చెందిన 6826 మంది మహిళలకు వైఎస్ఆర్ ఆసరా నాలుగో విడత కింద రూ.5.13 కోట్లకుపైగా లబ్ధి చేకూరిందని చెప్పారు. లబ్ధిదార్లంతా ఈ డబ్బులను తమ పిల్లల చదువుల ఉపయోగించాలని సూచించారు. అనంతరం సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. వైస్ ఎంపిపిలు ఖాసింబి, సాంబశివరావు, సొసైటీ చైర్మన్ పి.రాంబాబు, ఎంపిటిసి మాలతి, సర్పంచ్ డి.పద్మారావు, మిర్చియార్డ్ డైరెక్టర్ ఇంద్ర, ఆర్ అండ్ బి డైరెక్టర్ మేరీరాణి, మండల సమైక్య అధ్యక్షులు శ్యామల, ఎపిఎం సుబ్బారావు, జెసిఒ వీరాస్వామి. సీసీలు మాధవి, శ్రీను, సుబ్బారావు, సైదావలి పాల్గొన్నారు.

కెనరా బ్యాంకు క్రీడా పరికరాలు వితరణ

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

మండలంలోని మాచవరం జెడ్‌పి పాఠశాలకు రూ.65,485తో సమకూర్చిన క్రీడా వస్తువులను కెనరా బ్యాంక్ ములుకుదరు శాఖ శుక్రవారం అందించింది. బ్యాంక్ మేనేజర్ నరేష్



మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ ఆసక్తి పెంచుకుని ఉన్నత శిఖరాలను అవరోధించాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జి.సుమతి, ఉపాధ్యాయులు, బ్యాంకు సిబ్బంది, సర్పంచ్ పాల్గొన్నారు.

అభ్యర్థుల గెలుపోటములు మహిళల చేతుల్లోనే

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి నియోజకవర్గంలో మహిళా ఓటర్ల హవా కనిపిస్తోంది. పురుష ఓటర్ల కంటే 10,056 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉండడం ద్వారా రానున్న ఎన్నికల్లో గెలుపోటములను వారే నిర్ణయించనున్నారు. మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని మంగళగిరి అర్బన్, మంగళగిరి రూరల్, తాడేపల్లి అర్బన్, తాడేపల్లి రూరల్, దుగ్గిరాల మండలాల్లో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. అధికారులు తాజాగా విడుదల చేసిన జాబితా ప్రకారం మంగళగిరి అర్బన్‌లో పురుష ఓటర్లు 31,458 మంది ఉండగా, మహిళా ఓటర్లు 33,962 మంది వున్నారు. మంగళగిరి రూరల్‌లో పురుష ఓటర్లు 36,409 మంది ఉండగా, మహిళా ఓటర్లు 39,233 మంది ఉన్నారు. తాడేపల్లి అర్బన్‌లో పురుష ఓటర్లు 24,869 మంది, మహిళా ఓటర్లు 26,641 మంది, తాడేపల్లి రూరల్‌లో పురుష ఓటర్లు 20,441 మంది, మహిళా ఓటర్లు 22,300 మంది ఉన్నారు. దుగ్గిరాల మండలంలో పురుష ఓటర్లు 24,761 మంది, మహిళా ఓటర్లు 26,605 మంది ఉన్నారు. థర్డ్ జెండర్ ఓటర్లు 19 మంది ఉన్నారు. నియోజకవర్గంలో మొత్తం పురుష ఓటర్ల సంఖ్య 1,37,938 కాగా మహిళా ఓటర్లు 1,48,444 మంది ఉన్నారు. నియోజకవర్గంలో మొత్తం 2,86,401 మంది ఓటర్లున్నారు.



మోటారు వాహన సవరణ చట్టాలను తిప్పికొట్టాలి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన మోటారు సవరణ చట్టానికి వ్యతిరేకంగా జనవరి 16న విజయవాడలో జరగనున్న దేశవ్యాప్త నిరసనలో రవాణా కార్మికులంతా పాల్గొనాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నన్నపనేని శివాజీ పిలుపునిచ్చారు. స్థానిక వివిఎస్ఆర్ కళాశాల ఎదురుగా ఫ్రెండ్స్ మినీలారీ అసోసియేషన్ కార్యాలయంలో షేక్ కరిముల్లా అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. శివాజి మాట్లాడుతూ జీవో 21 ద్వారా అన్ని రకాల రోడ్డు ఫీజులు, పెనాల్టీలు భారీగా పెంచారన్నారు. డీజిల్, పెట్రోల్ ధరలు పెరగడం, రోడ్ల నిర్మాణం సరిగ్గా లేకపోవడం వలన జరిగే ప్రమాదాలకు ప్రజలను బాధ్యులను చేయటం అన్యాయమన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మలకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై జరుగుతున్న సభను జయప్రదం చేయాలని, మోటారు వాహనాలు యజమానులు, డ్రైవర్లను కోరారు. సమావేశంలో ఎం.సాంబశివరావు, వి.జగన్మోహన్‌రెడ్డి, పి.బాజీఖాన్, కోటేశ్వరరావు, ఖాలేష, సుభాని పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్ : జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం నిడుబ్రోలు జెడ్‌పి హైస్కూల్ విద్యార్థుల కు ఆల్బెండజోల్



మాత్రలు పంపిణీ చేశారు. డాక్టర్ మీర్ హుసేన్ మాట్లాడుతూ చేతులు శుభ్రం చేసుకున్నాకే ఏదైనా తినాలని సూచించారు. రక్తహీనత నివారించేందుకు ప్రతి ఒక్కరు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలన్నారు.

12న జిల్లా ఇన్‌స్పైర్ మానక్ ప్రదర్శన

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మానక్ ప్రదర్శన ఈనెల 12వ తేదీన స్థానిక పాతబస్టాండ్ కూడలి వద్ద గల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు, బాపట్ల జిల్లాలకు చెందిన 112 ప్రాజెక్టులు ప్రదర్శిస్తారని, ఏ ఒక్కరికీ మినహాయింపు లేదని, ఎవరూ గైర్హాజరు కాకూడదని స్పష్టం చేశారు. ఇతర వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ఎ.రవికుమార్ (9849627708)ను సంప్రదించాలన్నారు.

నిరుపయోగంగా రూ.25 లక్షల సైకిళ్లు

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్ : నిడుబ్రోలు జెడ్‌పి పాఠశాలలో విద్యార్థినుల కోసం 2019లో ప్రభుత్వం అందించిన సైకిళ్ల పంపిణీకి నోచలేదు. ఈ పాఠశాలకు 300 సైకిళ్లను 2019 జనవరిలో అందించగా, మండలంలోని మరో 12 పాఠశాలల్లో విద్యార్థినుల కోసం 400 సైకిళ్లను అప్పటి టిడిపి ప్రభుత్వం సరఫరా చేసింది. పాఠశాలకు సైకిళ్ల విడిభాగాలు రాగా వాటిని బిగించే వర్కర్లను 2019 మార్చిలో కాంట్రాక్టుకు ఇచ్చారు. అయితే ఎన్నికల కోడ్ కారణంగా సైకిళ్లను బిగించడానికి వీల్లేకుండా పోయింది. ప్రభుత్వం మారడంతో సైకిళ్ల పంపిణీ అటకెక్కింది. రూ.25 లక్షలతో సమకూర్చిన సైకిళ్లు పంపిణీకి నోచలేదని, స్థానిక ఎమ్మెల్యే కిలారు వెంకటరోశయ్యే ఇందుకు కారణమని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి టి.లక్ష్మీనారాయణ చౌదరి విమర్శించారు.



దేశాభివద్ధిలో గ్రామాల పాత్ర కీలకం

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక టిజెపియస్ పీజీ కాలేజిలో గత రెండ్రోజుల నుండి కొనసాగుతున్న జాతీయ సదస్సు ఈ రోజుతో ముగిసింది. ముఖ్య వక్తగా కళాశాల పూర్వ విద్యార్థి, అపెక్స్ సొల్యూషన్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.నరేంద్రకుమార్ మాట్లాడుతూ గ్రామాలు ఆర్థికంగా బలపడితే దేశాభివద్ధి జరుగుతుందని, గ్రామీణ ఉత్పత్తులైన ఆహార పంటలు వరి, గోధుమలు, శనగలు, వేరు శనగలు, పప్పుధాన్యాలు, కాయగూరలు వంటివి, వాణిజ్య పంటలు పొగాకు, ప్రత్తి, చెఱకు, మొక్కజొన్న, వస్త్రాలు వంటివి, పాడి పరిశ్రమలు, ముడి సరుకులను సాంకేతికత ద్వారా ఎప్పుడైతే ముందుకు వెళ్తామో అప్పుడు నిజమైన దేశాభివద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. సదస్సులో 35 మంది అధ్యాపకులు పరిశోధన పత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండంట్ కె.వి.బ్రహ్మం, ప్రిన్సిపాల్ మేజర్ ఎ.బి.పి.మనోహర్, పీజీ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు : రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా ఆర్టీసీ గుంటూరు-1 డిపో ఆధ్వర్యంలో స్థానిక పాతగుంటూరులోని యాదవ హైస్కూల్లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీలలో విజేతలకు ఈనెల 13న గుంటూరు బస్టాండ్‌లో జరిగే రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు సభలో బహుమతులు అందజేస్తారని డిపో మేనేజర్ తెలిపారు.





టెండర్లు.. ఐదేళ్లుగా ప్రజాధనం వృథా

ప్రజాశక్తి - చిలకలూరిపేట

అవినీతి రహిత పాలనే ధ్యేయంగా అధికారులందరూ పనిచేయాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పలు సభల్లో చెబుతున్న విషయం తెలిసిందే. రివర్స్ టెండరింగ్ విధానంలో టెండర్లు నిర్వహించి భారీగా ప్రజాధనం ఆదా చేశామని ప్రకటించారు. అయితే, ప్రభుత్వ లక్ష్యానికి భిన్నంగా చిలకలూరిపేట మునిసిపాలిటీలో టెండర్ల ప్రక్రియ సాగుతోంది. సాధారణంగా టెండర్లు అనగానే కాంట్రాక్టర్ల మధ్య పోటీ నెలకొని, టెండరు అంచనా వ్యయం కన్నా తక్కువకు కోట్ చేసి పనులు దక్కించుకోవడం చూసూ ఉంటాం. కానీ అందుకు భిన్నంగా ఒక్కో అబివృద్ధి పనికి ఒక్కరే కాంట్రాక్టర్ టెండరులో పాల్గొనడం, ప్రభుత్వ అంచనా వ్యయం కన్నా అధిక ధరను కోట్ చేయడం, దాన్ని మున్సిపల్ కౌన్సిల్ ఆమోదించడం గత ఐదేళ్ళుగా జరుగుతున్న తంతు. ఈ వ్యవహారంలో కోట్లాది రూపాయల ప్రజాధనం పక్కదారి పట్టి నేతలు, అధికారుల జేబుల్లోకి చేరుతోంది. ఈ వ్యవహారానికి అధికార పక్ష కౌన్సిలర్లు ఆ మోద ముద్ర వేయడం, ఇదేమని ప్రశ్నించాల్సిన ప్రతిపక్ష కౌన్సిలర్లు తమ గొంతు పెగల్చకపోవడంతో ప్రజాధనం నిర్వహణలో వారి వైఫల్యాన్ని ఎత్తిచూపుతోంది. జనవరి నెలా ఖరున జరిగిన కౌన్సిల్ సమావేశంలో 50 అంశాలతో అజెండాను రూపొందించి నామ మాత్రపు చర్చతో ఆమోదించుకున్నారు. సదరు అజెండాలో ఎక్కువ అంశాలు వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్ల ఆమోదానికి సంబంధించినవే. వీటిలో 95 శాతం పైగా పనులకు ఒక్కొక్కరే కాంట్రాక్టర్లు ఎక్కువ ధరకు టెండర్లు వేశారు, వాటిని కౌన్సిల్లో ఆమోదించారు. అదేవిధంగా గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ప్రజా ధనం పూర్తిగా దుర్వినియోగమైందనే ఆరోపణలు లేకపోలేదు. ఒక్క ఆరోగ్య సురక్ష పథకం ప్రచారం కోసం భారీగా ప్రజాధనం ఖర్చుపెట్టారు. దీని ప్రచారానికి రూ.12.20 లక్షలు ఖర్చు చేశారు. అదే అజెండాలో పార్కులు అభివృద్ధి పేరిట రూ.19,97,520 చెల్లించినట్లు చూపారు, పార్కులు, ఆటస్థలాల్లో (ప్లేగ్రౌండ్) వ్యాయామ ఉపకరణాల నిమి త్తం సన్సున్ ఇండ్రస్టీ ప్రైవేట్ లిమిటెడ్ వారికి 110 వస్తువులు ఏర్పాటు చేసే పని అప్ప గించారు. వాస్తవానికి ఎక్కడా ఆ వస్తువులు ఏర్పాటు చేయడం గానీ, అభి వృద్ధి చేయడం గానీ జరగలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. అజెండాలోని 31వ అంశంలో ప్రజారోగ్యాభివృద్ధి దృష్ట్యా ఎక్కడ ఏం పనులు జరిగాయో తెలియకుండా చేశారంటున్నారు. 9వ వార్డు నుంచి వరుసగా 14వ వార్డు వరకూ 6 వార్డులు, 29 నుంచి 38వ వార్డు వరకూ 10 వార్డులు మొత్తం 16 వార్డుల్లో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో టెంట్లు, కుర్చీలు వేసేందుకు గాను శ్రీ గౌరీ శంకర్ ఇవెంట్స్ వారికి చేసిన చెల్లింపులు రూ.3.65 లక్షలు కాగా, మరో 16 వార్డుల్లో సచివాలయాల వద్ద జ రిగిన శిబిరాల్లో టెంట్లు, కుర్చీలకు స దరు సంస్థకు రూ.3.60 లక్షలు చెల్లించారు. ఇదే తరహా కార్యక్రమాలు కేవలం 8 వార్డుల్లో జరగ్గా వి. శ్రీనివాసరావు అనే కాంట్రాక్టరుకు రూ. 5 లక్షలు చెల్లించారు.

ఆయా చెల్లింపులను అనుసరించి ప్రజాధనం ఏ స్థాయిలో దుర్వినియోగమవుతోందనే విషయం అర్ధమవుతుంది. అజెండాలోని 39,40 అంశాల్లో తాగు నీటి చెరువులను సాగర్ జలాలతో నింపేందుకు మనుషులతో కాపలా, జీపు, అయిల్ ఇంజన్లు, తూములు పూడ్చేందుకు ఇసుక బస్తాలు తదితరాలకు రూ.10 లక్షలు ఖర్చు చూపారు. 43వ అంశంలో ప్రింటింగ్ ఖర్చుల కింద రూ.10లక్షలు, పన్నులు వసూలు ప్రచారం నిమిత్తం రూ. 6 లక్షలు ఖర్చు చూపారు. 44వ అంశంలో స్టేషనరీ ఖర్చుల నిమిత్తం రూ.15 లక్షలు, జి రాక్స్ నిమిత్తం రూ.2.50 లక్షలు. చూపారు. మున్సిపల్ కార్యాలయంలో జిరాక్స్ మిషన్లు ఉన్నప్పటికీ బయట తీయించాల్సిన అవసరమేంటో అర్థంకాని పరిస్థితి. 46వ అంశంలో అద్దెలు రావాల్సి ఉండగా వసూలు చేయకుండా ఖర్చుల కోసం మున్సిపల్ ఆస్తులను తాకట్టు పెట్టడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. అజెండాలోని 49వ వరుస నంబరులోని 55 అంశాలు అని లెక్కలు చూపిస్తున్నారు. ఒక్కొక్క చోట మరి ఎక్కువగా చెల్లింపులు చేస్తున్నట్లు ఉన్నాయి. ఈ విధంగా ప్రజాధనం చేయడంపై విమర్శలు వసున్నాయి. ఇప్పటికైనా అధిక టెండ ర్లను తగ్గించాలని, ప్రజాధనం వృథా కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.







కొండవీడు ఫెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయపురిసౌత్

కొండవీడు ఫెస్ట్ కు సంబంధించి పోస్టర్, పాంప్లెట్స్ ను మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బూడిద మంగమ్మ కుమారుడు, వైసీపీ నాయకులు బూడిద శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎం.పి.డి.ఓ సరోజిని దేవి, పిఓపిఆర్డి కోటేశ్వరరావు, గాదే శ్రీనివాసరావు, పంచాయతీ సెక్రెటరీ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

13న సఫాయి కార్మికులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి - మాచర్ల

ఈ నెల 13వ తేదీన సఫాయి కార్మికులకు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు కమిషనర్ వెంకటదాసు తెలిపారు. ఆయన విలేఖరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సఫాయి కార్మికులకు మెరుగైన ఉపాధి, జీవన భద్రత, సామాజిక న్యాయం చేసేందుకు నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ ఎకో సిస్టమ్(నమేస్తే)ను రూపొందించినట్లు తెలిపారు. సెప్టిక్ ట్యాంక్ డ్రైవర్లు, హెల్పర్లు తదితర సఫాయి కార్మికులు ఈ పథకంలో తమ పేర్లు నమోదు చేయించుకుంటే వారికి ఆయుష్మాన్ భారత్ ద్వారా ఉచిత వైద్యం, వారి పిల్లలకు స్కాలర్ షిప్స్, మెరుగైన జీవనం కోసం రుణాలు తదితర అందిస్తారని తెలిపారు. ఎపి ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని స్వఛ్చాంధ్ర కార్పోరేషన్ ఆధ్వర్యంలో ఫైలెట్ ప్రాజెక్ట్ నిర్వహిస్తుందన్నారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో జరిగే సదస్సులో సఫాయి కార్మికులు పాల్గొనాలన్నారు.

. వ్యవసాయ రంగం పై నిర్లక్ష్యంతగదు

ప్రజాశక్తి పెదకూరపాడు

వైసీపీ ప్రభుత్వంలో వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేయటం వల్ల ఆ రంగం నుండి ఉత్పత్తి తగ్గిందని పెదకూరపాడు మండల టిడిపి అధ్యక్షులు రమేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని రామాపురం గ్రామంలో మన ఇంటికి మన కొమ్మాలపాటి కార్యక్రమం నిర్వహించారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మత్తులు , చెట్లు తొలగింపుకు చర్యలు చేపట్టిన నేపథ్యంలో నేడు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు నరస రావుపేట పట్టణ మండల పరిది లోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏడిఏ వై.ఏడుకొండలు శుక్రవారం ఒక ప్రక టనలో తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం

ప్రజాశక్తి-విజయపురిసౌత్



సుమారు 50 సంవత్సరాలు వయస్సు పైబడిన గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్య కారణాలతో మృతి చెందాడు. ఫిబ్రవరి 2వ తేదీన మాచర్ల ప్రభుత్వాసుపత్రిలో చేరి చికిత్స పొంది, అక్కడ నుండి మెరుగైన వైద్యం నిమిత్తం మొదట నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొంది, అక్కడ నుండి గుంటూరు గవర్నమెంట్ హాస్పిటల్ కి రిఫర్ చేయబడ్డాడు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడని పట్టణ సీఐ శరత్ బాబు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి ఆచూకీ తెలిసినవారు మాచర్ల పట్టణ పోలీస్ స్టేషన్ 08642 222333కు గాని మాచర్ల పట్టణ సీఐ నంబర్ 9440796240 కు గాని సమాచారం ఇవ్వాలని కోరారు.



ఓట్ల తొలగింపునకు కుట్ర

ప్రజాశక్తి-ఈపూరు

అధికార పార్టీ నాయకులు ఫారం-7 ద్వారా టిడిపి సానుభూతిపరుల ఓట్లు తొలగిస్తున్నారని పల్నాడు జిల్లా టిడిపి అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఓటర్ల ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలపై తహసీల్దార్ బి దిలీప్ కుమార్ ను కలిసి శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రాపర్ల జగ్గారావు మాట్లాడుతూ ముప్పాళ్ళ,గోపువారిపాలెం గ్రామాలలో ఒకే వ్యక్తికి రెండు ఓట్లు కలిగి ఉండటాన్ని గుర్తించి తొలగించేందుకు ఫారం-7 దరఖాస్తు చేసినప్పటికీ తొలగించడం లేదని తెలుగుదేశం పార్టీ చెందిన వారి ఓట్లను వివిధ కారణాలు చూపుతూ తొలగించేస్తున్నారని అన్నారు. కొత్త ఓటరు నమోదుకు పొంతనలేని కారణాలు చూపుతూ దరఖాస్తులను తిరస్కరిస్తున్నారన్నారు. అధికారులు పార్టీలకతీతంగా ఓటర్ల దరఖాస్తుల నమోదు ప్రక్రియలో పనిచేయాలన్నారు.

ఈపూరు ఎంపీపీకి రెండుచోట్ల ఓట్లు

ఎంపీపీ ఈదర రాధికకు బాపట్ల జిల్లా తెనాలిలో, ఈపూరు మండలం పెద కొండాయపాలెం గ్రామంలో రెండు చోట్ల ఓట్లు ఉన్నాయని పెద కొండాయపాలెం గ్రామానికి చెందిన మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గన్నమనేని వెంకయ్య ఆరోపించారు.గ్రామంలో ఉన్న తన ఓటును తొలగించేందుకు అదే గ్రామానికి చెందిన వైసిపి నాయకులు శాఖమూరి బుచ్చయ్య ఫారం-7 దరఖాస్తు చేశారని ఓటరు తొలగింపు పై బుచ్చయ్యని ప్రశ్నిస్తే తాను దరఖాస్తు చేయలేదని అన్నారని తన వద్ద ఆధారాలు ఉన్నాయని చూపారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు టి బాలయ్య,ఐ కోటేశ్వరరావు,జి శ్రీనివాసరావు, ఎన్ అక్కారావు,జి వీరాంజనేయులు,బి సైదులు,బి సుబ్బారావు,డి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు

ప్రజాశక్తి - మాచర్ల

విద్యార్ధులు కష్టంతో కాకుండా ఇష్టపడి అసక్తితో చదివితే వారు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ నవ నిర్మాణ కోచ్ రంగా రత్నశ్రీ వివరించారు. స్థానిక కిడ్స్ పాఠశాలలో వాసవీ క్లబ్ మాచర్ల చెన్నకేశవ వారి ఆధ్వర్యంలో విద్యార్ధులకు మోటివేషన్ క్లాస్‌లు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి క్లబ్ అధ్య క్షులు ఓరుగంటి చెన్న కేశవరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన రంగా రత్నశ్రీ మాట్లాడుతూ విద్యార్ధులు మొబైల్ ఫోన్లను అవసరానికి మించి వాడకూడదన్నారు. పరీక్షలలో రాణించేందుకు అవసరమైన మెళుకువలు వివరించారు. విద్యార్ధులు రాణిస్తే తల్లి,తండ్రులు, గురువుల ఆనందానికి అవధులు ఉండవన్నారు. విద్యార్ధులు సమయ పాలన పాటించాలన్నారు. సిలబస్ పట్ల అవగాహన కల్గి ఉండలన్నారు. పెరుగుతున్న పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్ధులు పుస్తకాల పరిధి దాటి అదనపు స్కిల్స్ పట్ల కూడ పట్టు సాధించాల్సి ఉందన్నారు. తల్లి,తండ్రులు తమ పిల్లలపై అనేక ఆశలు పెట్టుకుంటారని వివరించారు. వారి త్యాగం వేలకట్టలేనిదన్నారు. మీరు రాణించి ఉన్నత పౌరులుగా ఎదిగి సమాజంలో గుర్తింపు ఇవ్వటమే వారికి మనం ఇచ్చే ఆనందమన్నారు.



న్యాయవాదులకు సంఘీభావం తెలిపిన కన్నా లక్ష్మీనారాయణ

ప్రజల ఆస్తులకు రక్షణ లేని భూ హక్కుల చట్టం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ప్రజల ఆస్తులకు రక్షణ లేని భూ యాజమాన్య హక్కు చట్టం 27/2023న తక్షణం రద్దు చేయాలని సత్తెనపల్లి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి కన్నా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. భూ హాక్కు చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు చేస్తున్న రిలే దీక్షలు శుక్రవారం నాటికి నాల్గవ రోజుకు చేరాయి. టిడిపి ఇన్చార్జి కన్నా లక్ష్మీనారాయణ నిరహారదీక్షల శిబిరాన్ని సందర్శించి న్యాయవాదులకు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వస్తే చట్టాన్ని రద్దు చేస్తామని వెల్లడించారు. ప్రభుత్వ నిర్ణయాలను చట్టసవరణ లను రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం కోటేసిందనీ అన్నారు. దేశాలో ఏ రాష్ట్రంలో లేని విదంగా ఆంధ్ర ప్రదేశ్ లో అత్యధిక కేసులు హై కోర్టు కొట్టివేసిందని వివరించారు. తక్షణం చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో న్యాయవాదులు చిలుకా చంద్రశేఖర్,పూజల వెంకట కోటయ్య భాపయ్య చౌదరి, అనుమోలు జయరాం , సర్వేపల్లి సీతారామ్ కొల్లా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- వినుకొండ: జాతీయ రైతు సంఘాల, కార్మిక సంఘాల పిలుపుమేరకు ఈనెల 16వ తేదీన గ్రామీణ పారిశ్రామిక బందును జయప్రదం చేయాలని రైతు కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. వినుకొండ పట్టణంలో శివయ్య భవన్లో జరిగిన రైతు కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైన వక్తలు మాట్లాడారు.

ప్రజాశక్తి 7
గుంటూరు జిల్లా
శనివారం 10 ఫిబ్రవరి 2024

కుష్టు బాధితుల్లో సగానికిపైగా మన దేశంలోనే

- నివారణకు ముమ్మర ప్రయత్నం
- బాధితుల గుర్తింపు కోసం సర్వే

ప్రజాశక్తి - దుగ్గిరాల

కుష్టు వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలని ప్రభుత్వం గాంధీజీ వర్ధంతి సందర్భంగా ప్రతి సంవత్సరం జనవరి 30 తేదీ నుండి ఫిబ్రవరి 13వ తేదీ వరకు కుష్టు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా వైద్య సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఇంటింటికీ తిరిగి సర్వే చేస్తున్నారు. దాదాపు 140 కోట్ల జనాభా కలిగిన మన దేశంలో కుష్టి వ్యాధి నిర్మూలన అంత సులభం కాదని డబ్ల్యూహెచ్ఒ అభిప్రాయపడుతోంది. అందుకు తగిన కారణాలు లేకపోలేదు. ఆర్థికంగా వెనుకబడిన దేశాల్లోని ఈ వ్యాధి అధికంగా ప్రబులుతోంది. బంగ్లాదేశ్, కాంగో, ఇథియోపియా, మడగాస్కర్, మయన్మార్, శ్రీలంక, నేపాల్, నైజీరియా, ఫిలిఫైన్స్, సూడాన్ తదితర దేశాల్లో కుష్టు బాధితులు అధికమని డబ్ల్యూహెచ్ఒ తెలిపింది. 2022లో ప్రపంచవ్యాప్తంగా 16,5459 కేసులు ఉండగా మరో 17,487 కేసులు నమోదయ్యాయి. అందులో 39 శాతం మహిళలు, 3 శాతం పిల్లలు ఉన్నారు. ఇందులో 57 శాతం కేసులు మన దేశంలోనే నమోదైనట్లు తెలిపింది.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 2022 మార్చి 31వ తేదీ నాటికి 123 కేసులు ఉండగా ఏప్రిల్ ఒకటి 2023 నుండి ఇప్పటివరకు 115 కొత్త కేసులు నమోదయ్యాయి. 131 మంది పూర్తిగా వైద్యం పొందారు. ప్రస్తుతం జిల్లాలో 105 మంది వ్యాధిగ్రస్తులు చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం చేపట్టిన సర్వేలో ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.



ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

దుగ్గిరాల మండలంలోని దుగ్గిరాల పిహెచ్‌సి పరిధిలో 8, ఈమని పిహెచ్‌సి పరిధిలో 10 కేసులు ఉన్నాయి. 2023 డిసెంబర్ 28 నుండి 2024 జనవరి 12 వరకు ఎల్‌సిడిసి లెప్రసీ డిసీస్ డిటెక్షన్ క్యాంపెయిన్ సర్వేలో దుగ్గిరాల పిహెచ్‌సి పరిధిలో 1, ఈమని పిహెచ్‌సి పరిధిలో 2 కేసులు నమోదయ్యాయి. దీనితో ప్రస్తుతం మండల వ్యాప్తంగా 22 కేసులున్నాయి.



ప్రస్తుతం జరుగుతున్న పక్షోత్సవాల సందర్భంగా ఇంటింటికీ తిరిగి కుష్టు వ్యాధి లక్షణాల్లో ఒకటైన శరీరంపై మచ్చలు పరిశీలిస్తున్నట్లు దుగ్గిరాల పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సి.ఇందిర తెలిపారు.

శరీరంపై రాగి రంగు, తెలుపు, స్పర్శ, నొప్పి లేని మచ్చలు ఈ వ్యాధి ప్రాథమిక లక్షణాలు. 1873లో నార్వే శాస్త్రవేత్త గెరహార్డ్ హేన్రిక్ ఆర్మార్ హాన్సన్ ఈ వ్యాధికి కారణం మైక్రో బాక్టీరియం అనే బ్యాక్టీరియా అని కనుగొన్నారు. చికిత్స పొందని వ్యక్తి తుమ్మినా, దగ్గినా దానిద్వారా ఇతరులకు సోకుతుంది. ఎమ్‌డిఎం మల్టీ డ్రగ్ థెరపీ మూడు రకాల మందుల కలయిక కల టాబ్లెట్లు నోవార్టీస్ అనే స్విజర్లాండ్ కంపెనీ మన దేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉచితంగా అందిస్తోంది. ప్రారంభ దశలో శరీరంపై రెండు నుండి ఐదు మచ్చలుంటే ఆరు నెలలు.. అంతకన్నా ఎక్కువ ఉంటే ఏడాదిపాటు వైద్యం పొందాల్సి ఉంటుంది. సకాలంలో వైద్యం అందకపోతే శరీర ఆకృతిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. నాడీ వ్యవస్థపై, ముక్కు, గొంతుతో పాటు శాశ్వత వైకల్యం కలుగుతుంది.



డబ్బులొద్దు.. రోడ్లేయండి..

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

రాష్ట్రంలో కుదేలైన రవాణా రంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మన ఆంధ్ర మన టాక్సీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కస్తూరి భాస్కర్ కోరారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం కొలనుకొండలో శుక్రవారం జరిగింది. భాస్కర్ మాట్లాడుతూ డీజిల్ రేట్లు పెరుగుతున్నా కిరాయి రేట్లు పెరిగే పరిస్థితి లేదని, పాత టాక్సులు, పాత ఇన్సూరెన్స్‌లే కట్టలేని పరిస్థితిలో ఉన్నామని అన్నారు. అసోసియేషన్ కార్యదర్శి ఎస్.ఫణి కుమార్ మాట్లాడుతూ గతంలో గ్రీన్ టాక్స్ రూ.వెయ్యి ఉంటే ఇప్పుడు రూ.4 వేలు చేసి మళ్లీ రూ.వెయ్యి పెంచారని అన్నారు. ప్రభుత్వం ఏడాదికి రూ.10 వేలు వేయకున్నా పర్వాలేదని, రోడ్లు సరిగా వేయాలని కోరారు. రోడ్లు అధ్వానంగా ఉండడం వల్ల వాహనాలు తరచూ పాడవుతున్నాయని చెప్పారు. తమిళనాడులో ట్యాక్స్ రూ.4 వేలుంటే ఏపీలో రూ.7 వేలు ఎందుకుని ప్రశ్నించారు. ఒరిస్సా ప్రభుత్వం ఫోర్ వీలర్ టాక్సీ డ్రైవర్‌కు రూ. ఐదు లక్షలు ఇన్సూరెన్స్ ఇస్తోందని, ఏపీ ప్రభుత్వం కనీసం రూ.2 లక్షలనైనా బీమా కల్పించాలని కోరారు. సమావేశంలో బి.రవీందర్‌రెడ్డి, రామిరెడ్డి, వెంకటేశ్వర్లు, కె.సుందర్, ఎస్.ఫణీంద్ర, డి.మురళి, వై.మధు, జి.నాని, పాల్గొన్నారు.

విద్యార్థులకు నులిపురుగు నివారణ మందులు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా వీవర్స్ కాలనీ నగరపాలక సంస్థ హైస్కూల్లో శుక్రవారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.ఎమ్మెల్సీ ఎం.హనుమంతరావు, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జి.చిరంజీవి హాజరై విద్యార్థులకు మాత్రల పంపిణీని ప్రారంభించారు. వైద్యాధికారి డాక్టర్ పి.అనూష మాట్లాడుతూ నులిపురుగుల వలన వచ్చే అనారోగ్య సమస్యలు, కడుపులోకి నులిపురుగులు ప్రవేశించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలు గురించి వివరించారు. హైస్కూల్ హెచ్ఎం ఎస్.శ్రీనివాసరావు, వైసిపి పట్టణ అధ్యక్షులు ఎం.మల్లేశ్వరరావు, నాయకులు ఎ.రాజేష్, ఆర్.పెద్దబ్బాయి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల

ఆరోగ్యంగా ఉంటే చదువుతోపాటు ఆటపాటల్లోనూ రాణిస్తారని ఎంపిపి డి.సంతోష రూపవాణి అన్నారు. స్థానిక బాలికల హైస్కూల్లో విద్యార్థులకు జెడ్‌పిటిసి ఎం.అరుణతో కలిసి ఆల్బెండజోల్ మాత్రలు అందించారు. డాక్టర్ సి.ఇందిరా హెచ్ఎం ఎస్.శోభాదేవి పాల్గొన్నారు. స్థానిక కొత్త రఘురామయ్య మెమోరియల్ డిగ్రీ కళాశాలలో పిహెచ్‌సి వైద్య సిబ్బంది ఆల్బెండజోల్ టాబ్లెట్లు అందజేశారు ప్రిన్సిపల్ కె.గిరిధర్ రావు ఎన్ఎస్ఎస్ అధికారి బి.రాంబాబు, సరళదేవి, విజయ్‌కృష్ణ పాల్గొన్నారు.



మాత్రలు వేస్తున్న ఎమ్మెల్సీ హనుమంతరావు

టిడిపి నాయకులు కాట్రగడ్డ మధుసూదనరావు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ : టిడిపి సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదనరావు శుక్రవారం వడ్డేశ్వరానికి చెందిన పలువురు అనారోగ్య బాధ్యతలకు ఒక్కొక్కరికి రూ.పదివేల చొప్పున రూ.30 వేలను అందజేశారు. పార్టీ పేద, బడుగు, బలహీన వర్గాలకు టిడిపి ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ స్ఫూర్తితో సాయం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టిడిపి వడ్డేశ్వరం గ్రామ అధ్యక్షులు ఇ.బాబు, నాయకులు వి.అబ్రహం, నాగూర్‌వలి, జె.దాసు, పి.బాబురావు, ఎం.జోసెఫ్, ఎన్.అఖిల్, ఇ.కోటేశ్వరరావు, వి.ప్రసాద్, జి.లక్ష్మణరావు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదాల్లో గంటకు 18 మంది మృతి

భద్రత మాసోత్సవాల్లో జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం, ఆర్టీవో కె.ప్రసాద్

ప్రజాశక్తి - తెనాలి

రహదారి భద్రత అవగాహన సదస్సు శుక్రవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో నిర్వహించారు. ద్విచక్ర వాహన చోదకులు, ఆటో డ్రైవర్లు, లారీ ట్రాన్స్‌పోర్ట్ యజమానులు, డ్రైవర్లకు నిర్వహించిన సదస్సులో జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం ముఖ్యఅతిథిగా మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ముఖ్యంగా గతేడాది గణాంకాలను పరిశీలిస్తే దేశవ్యాప్తంగా నాలుగున్నర లక్షల రోడ్డు ప్రమాదాలు జరిగితే, 1.50 లక్షల మంది మృతి చెందగా దాదాపు 4.80 లక్షల మంది గాయపడ్డారన్నారు. రాష్ట్రంలో 19 వేల యాక్సిడెంట్లు జరిగితే అందులో 9600 మంది మృతి చెందారని, 23 వేల మంది గాయపడ్డారని వివరించారు. జిల్లాలో మొత్తంగా 986 రోడ్డు ప్రమాదాల్లో 333 మంది మృతి చెందారని, 1200 మంది గాయపడ్డరని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు ప్రజా జీవితంలో ఆందోళనకరంగా పరిణమించాయన్నారు. వాహనాలు నడిపేటప్పుడు అధిక స్పీడు, వాహనాలలో అధిక లోడు, మద్యం సేవించి వాహనాలు నడపటం ఇవన్నీ కూడా నిషేధమన్నారు. రవాణా శాఖ నిర్దేశించిన ప్రమాణాలను పాటిస్తూ ప్రమాదాలు అరికట్టేందుకు సహకరించాలని కోరారు. ఆర్టీవో కె.ప్రసాద్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలలో ప్రతి గంటకు 18 మంది మృతి చెందడం ఆందోళన కలిగించే అంశమన్నారు. ద్విచక్ర వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపేవారు సీటు బెల్ట్ ధరించాలని, హెవీ వాహనాలు నడిపేవారు కూడా రవాణా శాఖ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్, ఎంవిఐ రాఘవరావు, ఎఎంవిఐ మధుసూదనరావు, లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.



సిబ్బందిని అభినందిస్తున్న ఆర్టీసీ అధికారులు

ప్రజాశక్తి - తెనాలిరూరల్

నెల్లూరు జిల్లా ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.ఆదాం సాహెబ్, గుంటూరు డిపిటిఒ ఎం.రమాకాంత్ శుక్రువారం తెనాలి బస్ డిపోను సందర్శించారు. డిపోలో మెకానిక్ గ్యారేజి, డీజిల్ స్టేషన్లను పరిశీలించారు. ప్రయాణాల్లో ప్రమాదాలు జరగకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. బస్సుడ్రైవర్లకు కండక్లర్లు తోడ్పాటు అందించాలన్నారు. గతనెలలో ఉత్తమ సేవలందించిన డ్రైవర్లను, పలువురు గ్యారేజి సిబ్బందిని సన్మానించారు. హెచ్ఎస్డి ఆయిల్‌ను పొదుపుగా వినియోగించిన డ్రైవర్లను అభినందించి సత్కరించారు. రానున్నరోజుల్లో తెనాలి డిపోను ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.



రవీంద్రనాథ్ పురస్కారంతో డాక్టర్ శారదను సత్కరిస్తున్న నిర్వాహకులు

ఇద్దరికి ఆలపాటి రవీంద్రనాథ్, వెలగా వెంకటప్పయ్య పురస్కారాల ప్రదానం

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక నెహ్రూ రోడ్డులోని శాఖ గ్రంథాలయంలో శుక్రవారం ఆలపాటి కళావతి రవీంద్ర పీఠం ఆధ్వర్యంలో ప్రముఖ సంఘ సేవకులు, సంపాదకులు ఆలపాటి రవీంద్రనాథ్ పురస్కారాన్ని శారద సేవా సమితి నిర్వాహకులు డాక్టర్ డి.శారదకు అందించారు. గ్రంథాలయ ఉద్యమ పితామహులు డాక్టర్ వెలగా వెంకటప్పయ్య పురస్కారాన్ని గాన కళారత్న వెంపటి సత్యనారాయణకు ప్రదానం చేశారు. అలపాటి రవీంద్రనాథ్, కళావతి దంపతుల సంస్మరణ కార్యక్రమంలో భాగంగా పురస్కారాలను అందించినట్లు సభాధ్యక్షులు డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు చెప్పారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆచార్య గుజర్లమూడి కృపాచారి పురస్కార ప్రదానోత్సవ లక్ష్యాలను వివరించారు. పురస్కార గ్రహీతలు మాట్లాడుతూ సామాజిక బాధ్యతతో వ్యవహరించిన రవీంద్రనాథ్ పురస్కారాన్ని, ప్రముఖ బాలసాహితీవేత్తగా పేరొందిన వెలగా వెంకటప్పయ్య పురస్కారాలను అందుకోవడం మధురమైన జ్ఞాపకంగా చెప్పారు. కార్యక్రమంలో వై.హనుమంతరావు, గుంటూరు డీఎస్పీ జి.లక్ష్మయ్య, పి.శ్రీనివాసరావు, గ్రంథాలయాధికారి కె.రమాదేవి, సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

విద్యుత్ లైన్లు మరమ్మతులు కారణంగా తెనాలి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎపిసిపిడిసిఎల్ తెనాలి ఆపరేషన్ సబ్ డివిజన్ డిఇఇ అశోక్ కుమార్ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. స్థానిక అమరావతి ఫ్లాట్స్ ప్రాంతంలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు, తెనాలి గ్రామీణ ప్రాంతాల్లో 9 నుంచి 11 గంటలు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి - పెదకాకాని రూరల్

పెదకాకాని కాళీ గార్డెన్, ఎన్టీఆర్ కాలనీ, వడ్డెర కాలనీ, బైపాస్ ఏరియా, కొప్పురావూరులో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డిప్యూటీ ఈఈ ఖాన్, ఏఈ బి.శ్రీనివాసరావు తెలిపారు.

ప్రజాశక్తి-తాడేపల్లి

సబ్‌స్టేషన్ అత్యవసర మరమ్మతుల నిమిత్తం ఉండవల్లిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని డిఇ ఎ.సత్యనారాయణ, ఎఇ షణ్ముకరావు తెలిపారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ నేడు ప్రారంభం

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ఏర్పాటు చేసిన సిగ్నల్స్ ప్రారంభోత్సవం శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న తెలిపారు. పట్టణంలో ఎనిమిది ప్రాంతాల్లో సిగ్నల్స్ ఏర్పాటు చేశామని, బోస్ రోడ్ లోని వీనస్ థియేటర్ వద్ద సిగ్నల్స్‌ను కాంటినెంటల్ కాఫీ లిమిటెడ్ చైర్మన్ చల్లా రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం 11 గంటలకు రామకృష్ణ కవి కళాక్షేత్రంలో చల్లా రాజేంద్రప్రసాద్‌ను సత్కరించనున్నట్లు తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ టి.రాధిక, కౌన్సిలర్లు పాల్గొంటారన్నారు.

పిల్లలపై మొబైల్ గేమింగ్ ప్రభావం

నెహ్రూ నికేతన్ స్వర్ణోత్సవాల ముగింపులో జస్టిస్ మన్మథరావు





ప్రజాశక్తి - తెనాలి

చందమామ రావే.. జాబిల్లి రావే.. అంటూ పిల్లలను లాలించే చందమామ కథలు నేడు కనుమరుగయ్యాయని, పిల్లల ఆటపాటలు సెల్‌ఫోన్లతో ముడిపడిపోయాయని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావు వ్యాఖ్యానించారు. స్థానిక బోస్ రోడ్డులోని నెహ్రూ నికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ స్వర్ణోత్సవాలు గురువారం రాత్రితో ముగిసాయి. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ దాసరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతాకాంత్ పర్యవేక్షణలో జరిగిన స్వర్ణోత్సవాల్లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా అలరించాయి. దేశభక్తి గీతాలతో పాటు జానపద గేయాలకు నృత్యాలు చేశారు. ముగింపు సభలో జస్టిస్ కె.మన్మథరావు ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ పెరిగిన సాంకేతిక పరిజ్ఞానాన్ని సన్మార్గంలో ఉపయోగించుకుంటే ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో చిన్నారులకు మొబైల్ ఫోన్ ఒక ఆట వస్తువుగా మారిందని, దానితో పబ్జి వంటి గేమ్స్‌కు అలవాటు పడి విద్యార్థుల జీవితాలను పాడు చేసుకుంటున్నారని చెప్పారు. పిల్లలను పాఠశాలకు పంపించి ఉపాధ్యాయులపై భారం వేసి వదిలేయటం సరికాదని, తల్లిదండ్రుల పర్యవేక్షణా అనివార్యమని సూచించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న సౌత్ ఇండియా లీడ్ స్కూల్ జోనల్ అక్కడమిక్ ఎక్సలెన్స్ డైరెక్టర్ లోలుక్ మాట్లాడుతూ మారుతున్న విద్య ప్రమాణాలకు అనుగుణంగా, విద్యార్థుల మేధస్సుకు పదును పెడుతూ వారిని విభిన్న ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్న నెహ్రూనికేతన్ యాజమాన్యం తీరు అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా అతిథులను పాఠశాల యాజమాన్యం తరఫున సత్కరించారు. విద్యాసంస్థల వ్యవస్థాపకులు ప్రకాశరావు దాసరి, రంగలక్ష్మి దంపతులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

16న గ్రామీణ బంద్‌కు ఎల్ఐసి ఉద్యోగుల మద్దతు

ప్రజాశక్తి-గుంటూరు



సంఘీభావ కార్యక్రమంలో పాల్గొన్న యూనియన్ నాయకులు, ఉద్యోగులు

రైతులకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత, యువతకు ఉపాధి అవకాశాల పెంపుదల, కార్మికులకు కనీస వేతనాలు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, పాత పెన్షన్ స్కీం పునరుద్ధరణ, 14 శాతం పిఎఫ్ వాటా యాజమాన్యాలు చెల్లించడం, ఎల్ఐసిలో నూతన నియామకాలు, ప్రీమియంలపై జీఎస్టీ రద్దు తదితర డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం తక్షణమే సానుకూలంగా పరిష్కరించాలని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు జే.రాజేంద్రప్రసాద్ అన్నారు. ఫిబ్రవరి 16న దేశ వ్యాప్తంగా జరిగే గ్రామీణ సమ్మెకు మద్దతుగా శుక్రవారం గుంటూరులోని ఎల్ఐసి కార్యాలయాల వద్ద మధ్యాహ్నం భోజన విరామ సమయంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. అరండల్‌పేటలోని ఎల్ఐసి ఆఫీసు వద్ద జరిగిన కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రైతులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి కేంద్రం ఈ తొమ్మిదేళ్లలో చొరవేమీ చూపలేదని అన్నారు. తొమ్మిదేళ్లలో సుమారు లక్ష మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, రైతుల రుణమాఫీ చేయని ప్రభుత్వం, కార్పొరేట్లకు మాత్రం రూ.15 లక్షల కోట్ల పన్ను రాయితీలు ఈ కాలంలో ఇచ్చిందని విమర్శించారు. తాజా బడ్జెట్లో ఉపాధి కల్పనకు, కార్మికులకు కనీస వేతనాలకు సంబంధించి, పాత పెన్షన్ స్కీం పునరుద్ధరణకు సంబంధించి ఎలాంటి ప్రతిపాదనలు లేవని అన్నారు. పార్లమెంటరీ స్థాయీ సంఘం బీమా ప్రీమియంపై జిఎస్టిని తగ్గించాలని సూచించిందని, అయినా ప్రభుత్వం సానుకూలంగా స్పందించలేదని చెప్పారు. కార్మిక వర్గం, రైతులు ఫిబ్రవరి 16న చేస్తున్న దేశ వ్యాప్త సమ్మెకు మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ మచిలీపట్నం డివిజన్ సంయుక్త కార్యదర్శి వివికె సురేష్, జి.శివరామకృష్ణ, ఆర్.వి.ఎస్. శ్రీనివాస్, ఐ.వెంకట్రావు, పి.శ్రీదేవి, సి.శేషుకుమారి, కె.రాజేశ్వరి, ఎమ్.రాఘవ, పి.అరుణకుమారి పాల్గొన్నారు.

19 నుంచి వైఎస్సార్ కళాపరిషత్ నాటకోత్సవాలు

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఈనెల 19 నుంచి 22 వరకు వైయస్సార్ కళాపరిషత్ జాతీయస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు పట్టణ రంగస్థలం కళాకారుల సంఘం కార్యదర్శి జి.సుబ్బారావు చెప్పారు. స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ పట్టణ రంగస్థల కళాకారుల సంఘం, ప్రఖ్య చిల్డ్రన్ ఆర్ట్ థియేటర్ సంయుక్త ఆధ్వర్యంలో నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం ఐదు గంటలకు నాటిక ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఎంపిక చేసిన ఎనిమిది నాటికలు ప్రదర్శిస్తారన్నారు. తొలి రోజున అంటే 19న వైయస్సార్ పురస్కారం, 22న వైయస్సార్ లైఫ్ టైమ్ ఎచీవ్‌మెంట్ పురస్కారం అందించనున్నట్లు చెప్పారు. నాటకోత్సవాల ప్రారంభోత్సవం, పురస్కార ప్రదానోత్సవాల్లో స్థానిక ఎమ్మెల్యే ఎ.శివకుమార్‌తో పాటు పలువురు మంత్రులు పాల్గొంటారన్నారు. సమావేశంలో పట్టణ రంగస్థలం కళాకారుల సంఘం అధ్యక్షులు ఎం.సత్యనారాయణశెట్టి, గౌరవ సలహాదారు డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ప్రఖ్య చిల్డ్రన్ ఆర్ట్ థియేటర్ అధ్యక్షులు ఆరాధ్యుల కన్నా, పి.వెంకటేశ్వరరావు, డి.సుబ్రమణ్యం, ఎల్.లక్ష్మణరావు, తరుణి హేమంత్ పాల్గొన్నారు.

ఆర్‌విఆర్ అండ్ జెసి అధ్యాపకుడికి డాక్టరేట్

ప్రజాశక్తి-గుంటూరు



ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజీ ఫిజిక్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న నిమ్మగడ్డ శ్రీరామ్‌కు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. శ్రీరామ్ 'నోవెల్ మెటల్ ఆక్సైడ్ నానో స్ట్రక్చర్స్ ఆఫ్‌ది ఫోటోకేటలిక్ డిగ్రేడేషన్ ఆఫ్ టెట్రాసైక్లిన్ అండర్ విజిబుల్ లైట్ ఇర్రేడియేషన్' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈయనకు బాపట్ల ఇంజినీరింగ్ కాలేజి అధ్యాపకులు డాక్టర్ వి.రమణ గైడ్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా పిహెచ్‌డి కలిగి సిబ్బంది తమ కళాశాలలో 138 మంది ఉన్నారని, పరిశోధనలను కళాశాల ప్రోత్సహిస్తుందని కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ తెలియజేశారు. శ్రీరామ్‌కు కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, ఫిజిక్స్ విభాగాధిపతి డాక్టర్ ఎల్.వి.రమణమూర్తి అభినందించారు.

క్విజ్ పోటీల్లో అభ్యుదయ విద్యార్థులకు బహుమతి

ప్రజాశక్తి-గుంటూరు



నేషనల్ శ్యాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ వారు గుంటూరు ప్రభుత్వ ఉమెన్స్ కాలేజీలో నిర్వహించిన క్విజ్ పోటీలలో అభ్యుదయ మహిళా డిగ్రీ కాలేజి విద్యార్థులు ద్వితీయ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా వారిని కళాశాల డైరెక్టర్, అధ్యాపకులు అభినందించారు.

కార్పొరేటర్ల అర్జీలకు అధిక ప్రాధాన్యమివ్వాలి

ప్రజాశక్తి-గుంటూరు



కార్పొరేటర్లతో మాట్లాడుతున్న కమిషనర్

కార్పొరేటర్ల నుండి అందే ఫిర్యాదులు, అర్జీలను అధిక ప్రాధాన్యతతో పరిష్కరించాలని, వార్డుల వారీగా అభివృద్ధి పనుల్లో కార్పొరేటర్లతో సమన్వయం చేసుకుంటూ వేగంగా పూర్తి చేయాలని విభాగాధిపతులకు నగర కమిషనర్ కీర్తి చేకూరి సూచించారు. వార్డుల్లో అభివృద్ధి పనులు, స్థానిక సమస్యలపై కార్పొరేటర్లతో కమిషనర్ తన ఛాంబర్‌లో శుక్రవారం ప్రత్యేకంగా సమీక్షించారు. ఇప్పటికే వార్డుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను స్థానిక కార్పొరేటర్లతో సమన్వయం చేసుకుంటూ నిర్దేశిత గడువులో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్పొరేటర్లు అందించిన అర్జీలు, వాటి పరిష్కారంపై నివేదికివ్వాలని ఆయా విభాగాదిపతులను ఆదేశించారు. వార్డుల్లో మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై కార్పొరేటర్లు కూడా కమిషనర్‌తో చర్చించడానికి ప్రతి శుక్రవారం ప్రత్యేకంగా సమయం కేటాయించినట్లు చెప్పారు. మిగిలిన రోజుల్లో కూడా కార్పొరేటర్లకు అందుబాటులో ఉంటామని, వాట్సప్‌లో సమస్యలు తెలిపినా తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్పొరేటర్ల నుండి అందే అర్జీలు, ఫిర్యాదులు, ప్రతిపాదనలను క్రమ పద్ధతిలో రికార్డ్ చేసి, తదుపరి చర్యలు కూడా వారికి తెలిపేలా అధికారులను ఆదేశించామన్నారు.

అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లు పనులను నిర్దేశిత గడువులోగా, నాణ్యతా ప్రమణాలు పాటిస్తూ పూర్తి చేయాలని, కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కీర్తి చేకూరి అన్నారు. జిఎంసి కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ అధికారులతో కమిషనర్ స్పెషల్ గ్రీవెన్స్ నిర్వహించారు. కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తెచ్చారని, పరిష్కారానికి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించామని చెప్పారు. కాంట్రాక్టర్లు వర్క్ అగ్రిమెంట్ పొందిన అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా, నాణ్యతా ప్రమణాలు పాటిస్తూ పనులు పూర్తి చేయాలని, పనులకు సంబంధించి బిల్లుల ఆన్‌లైన్ చేయడం, చెల్లింపుల్లో ఎదురయ్యే సమస్యలను ప్రతి శుక్రవారం జరిగే స్పెషల్ గ్రీవెన్స్‌లో చెప్పాలని అన్నారు. కొన్ని అభివృద్ధి పనులపై ఫిర్యాదులు వస్తున్నాయని, ఆయా పనులను ఇంజినీరింగ్ అధికారులు మరొకసారి పరిశీలించి నివేదికివ్వాలని ఆదేశించారు. కాంట్రాక్టర్లు అందించిన ఆర్జీలను, ఫిర్యాదులను ప్రత్యేకంగా నమోదు చేయాలని, వారి సమస్యలు పరిష్కారం అయ్యాక తెలియచేయాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులు జరిగే సమయంలోనే ఆయా స్టేజీల ప్రకారం పనులను ఎంబుక్‌ను రికార్డ్‌ను ఎప్పటికప్పుడు చేయించాలని ఏ.ఈ.లను ఆదేశించామన్నారు. బిల్లుల చెల్లింపులో కూడా జాప్యం లేకుండా అన్ని స్టేజీల్లో వేగంగా రికార్డ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఇని ఆదేశించారు.

కెఎల్‌పి స్కూల్లో సూపర్ క్విజ్ పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక జెకెసి రోడ్డులోని డాక్టర్ కెఎల్‌పి పబ్లిక్ స్కూల్లో శుక్రవారం రాష్ట్రస్థాయి సూపర్ క్విజ్ బి పోటీలు నిర్వహించారు. పాఠశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ వై.రథినీచౌదరి, క్విజ్ మాస్టర్ డాక్టర్ ఇ.కోటేశ్వరరావు, పాఠశాల ఏఒ కె.వెంకటరావు జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ క్విజ్ అనేది ఫన్ యాక్టివిటీ లాంటిదని, విద్యార్థుల్లో ఏకాగ్రత సామర్థ్యం, విషయ అవగాహన శక్తి పెంపొందించుకోవటానికి ఉపయోగపడతాయని అన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు శ్రవణం ఎంతో అవసరం అని, ఇలాంటి పోటీల వల్ల చరిత్ర, భౌగోళం, సమాజం ఇలా అనేక అంశాలపై అవగాహన పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్రం నలుమూలల నుండి 17 పాఠశాలలు పాల్గొన్నాయి. డాక్టర్ కెఎల్‌పి స్కూల్ ప్రథమ స్థానం, నర్సరావుపేట ఐగ్రో ఇంటర్నేషనల్ హైస్కూల్ ద్వితీయ స్థానం, గుంటూరు నవభరత్ నగర్‌లోని శ్రీచైతన్య వైట్‌హౌస్ స్కూల్ తృతీయ స్థానం సాధించాయి. విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు.

గెలుపొందిన విద్యార్థులతో స్కూల్ కరస్పాండెంట్, తదితరులు





ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

చలపతిలో ఓమేగా ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి-గుంటూరు

బి.ఫార్మసీ, యం.ఫార్మసీ విద్యార్థులకు మెడికల్ కోడింగ్ విభాగంలో ఉద్యోగాల నిమిత్తం లాంలోని చలపతి ఫార్మసీ కాలేజీలో ఓమేగా హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ సర్వీసు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ శుక్రవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఓమేగా సర్వీసు లీడ్ మేనేజర్ హెచ్.ఆర్.విజయన్, ఎగ్జిక్యూటివ్ హెచ్ఆర్ ధరుణ్‌కుమార్ హాజరై ఎంపికలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ జిల్లాలోని పలు కళాశాలల నుండి 183 మందికిపైగా విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. వీరిలో 105 మంది విద్యార్థులు అర్హత సాధించారన్నారు. ఎంపికైన వారికి ఏడాదికి రూ.2.5 లక్షల వేతనం ఇస్తారన్నారు. ఉద్యోగాలు సాధించిన వారిని ప్రిన్సిపాల్‌తోపాటు చైర్మన్ వై.వి.ఆంజనేయులు అభినందించారు.